# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 44 సంచిక : 21 విజయవాడ 5-3-2012 పేజీలు : 8 వెల: రు 5.00



లోపలి పేజీల్లో...

- మా అమ్మ జ్ఞాపకాలు–ఛూ టే
- ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ 43వ వార్షికోత్సవ పిలుపు
- పత్రికాస్వేచ్ఛ దోపిడీ వ్యవస్థలో ఎండమావి
- దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రజాఆందోళనలు
- ప్రవాస భారతీయ దివస్: విదేశీ పౌరుడికి ఓటు హక్కు
- చేనేత వృత్తి రక్షణకు, కార్మికుల జీవన రక్షణకు చర్యలు చేపట్టాలి


## 2012 జాతీయ జలవిధాన ముసాయిదా

## నీటిని వాణిజ్య సరుకుచేసే విధానం

**2012** జనవరి 31న భారత ప్రభుత్వం నూతన జాతీయ జల విధాన ముసాయిదాను చర్చల కొరకు విడుదల చేసింది. 1987లో మొదటిసారిగా ప్రకటించిన జల విధానం స్థానంలో 2002లో జాతీయ జల విధానాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పుడు దానిస్థానంలో అమలు చేసేందుకు ఈ ముసాయిదా వచ్చింది.

ఈ ముసాయిదా జల విధాన లక్ష్యాన్ని "ప్రస్తుతం నెలకొని వున్న పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవడం, చట్టాలు, సంస్థల మొత్తం వ్యవస్థను రూపొందించే చట్రాన్ని ప్రతిపాదించడం, జాతీయ ఏకీకృత దృక్పధంతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం"గా ప్రకటించారు. ముసాయిదా ప్రకటించిన చట్రం, ఆచరణలో నీటిని వాణిజ్య సరుకుగా మార్చేందుకు దారితీస్తుంది.

జీవం, పర్యావరణం మనుగడ సాగించేందుకు తప్పనిసరైన సహజ వనరు నీరు. అన్ని రూపాల జీవుల అవసరాలకూ, అందుకు తగిన పర్యావరణాన్ని కాపాడేందుకు నీటిని హేతుబద్ధంగా వాడుకోవాలి.

**నీటి లభ్యత (శతకోటి ఘనపు మీటర్లు)**

| | |
|---|---|
| భారతదేశ ఉపరితలంపై కురిసే నీరు | 4000 |
| అందుబాటులో ఉండే ఉపరితల జలవనరులు | 1953 |
| అందుబాటులో ఉండే భూగర్భ జలవనరులు | 432 |
| వినియోగించుకోగల ఉపరితల జలవనరులు | 690 |
| వినియోగించుకోగల భూగర్భ జలవనరులు | 396 |
| వినియోగించుకోగల జల వనరుల మొత్తం | 1086 |
| ప్రస్తుత వినియోగం | 600 |
| 2050 నాటికి వినియోగ అవసరాలు (తక్కువ- అధిక అంచనాలు) | 973 నుంచి1180 |

*ఆధారం : ఎన్‌సిఐడబ్ల్యుఆర్‌డిపి నివేదిక-1999.*

సమీకృత జలవనరుల అభివృద్ధి ప్రణాళికపై జాతీయ కమీషన్ రూపొందించిన నివేదికలోని గణాంకాలు నీటి అందుబాటు, వినియోగాలు నిర్వహించదగిన పరిమితులలోనే వున్నాయని తెలుపుతున్నాయి. 2050 నాటికి అవసరాల అత్యధిక అంచనా 1180 బిసియంలు కాగా వినియోగించుకోగల వనరులు 1086 బియంసిలుగా వుంది.కానీ జలవిధాన ముసాయిదా జల సంక్షోభ స్థితి అన్న అంచనాను ప్రాతిపదికగా చేసుకుని సాగింది. "స్థల, కాలాల్లో హెచ్చుతగ్గులు", "విశాల ప్రాంతాల్లో" సంక్షోభ పరిస్థితి మానవ సృష్టేనన్న, ధనాఢ్యవర్గాలకు అనుకూలించే "అభివృద్ధి" భావన ఫలితమన్న వాస్తవాన్ని జల విధాన ముసాయిదా విస్మరించింది.

ముసాయిదా విధానం "ప్రజానిధి" సిద్ధాంతాన్ని చెబుతున్నది. దీని ప్రకారం నీరు ప్రైవేటు ఆస్తీకాదు; ప్రభుత్వ ఆస్తికాదు, సమాజం తరఫున ప్రభుత్వం ధర్మకర్తగా ఉంటుంది. అంటే అందరికీ అందుబాటులో ఉండేట్లు ప్రభుత్వం చూడాలి; దుర్వినియోగ పరచకుండా, ఇతరులకు దక్కకుండా చేయడాన్ని నిరోధించాలి. ఈ ప్రజానిధి అవగాహనకు పరిమితులున్నాయి. ఇది రాజ్యానికీ, ప్రస్తుత సమాజానికీ వర్తిస్తుంది తప్ప, భవిష్యత్తు తరాలతో సంబంధాలు, ఇతర రూపాల జీవులతోనూ, ప్రకృతితో సంబంధాలూ దాని పరిధిలో వుండవు. తత్పర్యవసానంగా జల విధాన ముసాయిదా లక్ష్యం "ఆహార భద్రతకు, జీవనోపాధికీ, అందరికీ సమాన పంపిణీకీ" పరిమితమైంది. (సెక్షన్ 1.3 (iv)). భవిష్యతరాల మానవుల కోసమూ, ఇతర జీవుల కొరకూ జలవనరుల రక్షణ దీనిలో చేరకుండా పోయింది.

ఇది జలవనరుల వినియోగపు ప్రాధాన్యతను నిర్దేశించడంలో కూడా వ్యక్తమైంది. జాతీయ జల విధానం 2002 జల వినియోగ ప్రాధాన్యతలను స్థూలంగా పేర్కొంది. (త్రాగునీరు, సాగునీరు, జలవిద్యుత్, పర్యావరణం, వ్యవసాయం, ఇతర పరిశ్రమలు, జల రవాణా) కాగా ప్రస్తుత విధాన ముసాయిదా జల వినియోగంలో ప్రాధాన్యతలను పేర్కొనకుండా వదలి వేసింది. అయితే "మానవుల, పర్యావరణ మనుగడకు అవసరమైన కనీస పరిమాణపు నీరు మినహా తక్కిన నీటిని ఆర్థిక సరుకుగా (ఇకనామిక్ గూడ్) వినియోగించాల"ని చెప్పింది.

మరొక మాటల్లో చెప్పాలంటే జీవనోపాధికీ, ఆహారానికీ అవసరమైన నీటిని ఆర్థిక సరుకుగా పరిగణిస్తారు. అంటే నీటికి ధరను నిర్ణయించి, దానిని చెల్లించగల వారికి సరఫరా చేయాలని అర్థం. విధాన ముసాయిదాలోని సెక్షన్ 7.1 ఇలా చెబుతున్నది : "నీటిని ఆర్థిక సరుకుగా పరిగణించాలి కనుక దానికి ధరను నిర్ణయించాలి. తద్వారా దాని సమర్థ వినియోగాన్ని ప్రోత్సహించాలి; దాని నుండి గరిష్ట విలువను రాబట్టాలి."

నీటి సమర్థ వినియోగాన్ని ప్రోత్సహించే ధరను నిర్ణయించడమంటే ధరను పెంచితే ప్రజలు వృధా చేయకుండా వాడుకుంటారన్న వాదనతో, కొనగలిగిన ధనికులకు సరఫరా చేసి, పేదలకు త్రాగునీరు కూడా దుర్లభం చేయడమే. నీటినుండి గరిష్ట విలువను రాబట్టడమంటే ధన రూపంలో విలువనే అర్థం. ఇది నీటి సరఫరాను వాణిజ్య సరుకుగా మారుస్తుంది.

ఇది ప్రపంచ బ్యాంకు నిర్దేశించిన విధానం. దీనినే భారత పాలకులు తు.చ. తప్పక పాటించేందుకు పూనుకున్నారు. "అధిక విలువ" వినియోగాలకి నీటి కేటాయింపులు జరగాలని ప్రపంచ బ్యాంకు సిద్ధాంతీకరణ. దీనికి గనుక అంగీకరిస్తే, ప్రపంచ బ్యాంకు మాటల్లో ".. అదనపు కేటాయింపులు అవసరమయ్యేవారు (నగరాల వంటివి) తక్కువ విలువకు వినియోగించే నీటిపై హక్కును దఖలు పరచుకోవచ్చు." ఈ మాటల్లో ఎవరు నీటిపై హక్కును తక్కువ విలువ గలిగినదిగా వదులుకోవాలన్న అంశంపై ఎలాంటి సందేహాలు ఏర్పడకుండా ప్రపంచ బ్యాంక్ వివరణ యిచ్చింది, "ఆహార పంటలకు వాడుతున్న సాగునీటి విలువ; నగరాలకూ, గృహ అవసరాలకు వాడే నీటి విలువలో అత్యల్పము" అని తేల్చి చెప్పింది.


**(తరువాయి 2వ పేజీలో)**


సంపాదకీయం

## ఇరాన్‌పై దాడికి టెర్రరిస్టు సాకుల సృష్టి

**ఇరాన్** అణ్వాయుధాలను తయారుచేస్తున్నదన్న నిందారోపణలతో 2006 నుండీ అనేక ఆర్థిక ఆంక్షలను సామ్రాజ్యవాదులు విధిస్తూ వచ్చారు. అణ్వాయుధాల తయారీకి ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానమూ, పరికరాలూ ఇరాన్‌కు ఎగుమతి చేయరాదన్న ఆంక్షలతో మొదలై క్రమంగా విస్తరించుకుంటూ వచ్చారు. ఇటీవల ఇరాన్‌నుండి చమురు కొనుగోళ్లు చేయరాదనీ, ప్రస్తుతం చమురు దిగుమతికి చేసుకుంటున్న కాంట్రాక్టులను 2012 జూలైతో ఆపివేయాలనీ యూరోపియన్ యూనియన్ తీర్మానించింది. దీనిద్వారా ఇరాన్ ఆర్థిక వ్యవస్థను క్షీణింపచేసి, ఇరాన్‌ను లొంగదీసుకోవాలన్న ప్రయత్నానికి సామ్రాజ్యవాదులు పూనుకున్నారు.

ప్రపంచ చమురు నిల్వలలో ప్రధానంగా సహజ వాయువులో 10శాతం నిల్వలున్న ఇరాన్ ఆర్థికవ్యవస్థ చమురు ఎగుమతులపై ఆధారపడివుంది. ఈ చమురు వనరులను తన ఆధిపత్యంలోకి తెచ్చుకునేందుకు, తద్వారా ప్రపంచాధిపత్యాన్ని పొందేందుకూ అమెరికా పూనుకుంది. యూరపులోని నాటో కూటమితో కలిసి ఇరాన్‌పై దాడులకు పూనుకుంది. ఇరాన్ రాజు షాపెహ్లావీ పదవీచ్యుతుడైన నాటి నుండీ ఇరాన్ ప్రభుత్వం మధ్యప్రాచ్యంలో అమెరికా సామ్రాజ్యవాదుల దోపిడీ, దురాక్రమణలను వ్యతిరేకిస్తూ వస్తున్నది. పాలస్తీనా ప్రజల పోరాటాన్ని సమర్థిస్తున్నది. ఇదికాక, అమెరికా ఆనాటినుండీ ఇరాన్‌తో ఆయుధ వ్యాపారాన్ని కోల్పోయింది. ఇరాన్‌లో కనుక తనకు లోబడివుండే ప్రభుత్వమేర్పడితే 5వేల కోట్ల డాలర్ల ఆయుధాలు అమ్ముకునే అవకాశం అమెరికా, యూరోపు సామ్రాజ్యవాదులకు ఏర్పడుతుంది. ఈ కారణాల రీత్యానే ఇరాన్‌లోని ప్రస్తుత ప్రభుత్వాన్ని తొలగించేందుకు అమెరికా పూనుకుంది.

లిబియాపై సైనిక దురాక్రమణతో గడ్డాఫీని హత్యచేసి, లిబియాను తమ ఆధీనంలోకి తెచ్చుకున్న అమెరికా, యూరోపు సామ్రాజ్యవాదులు ఇరాన్‌పై సైనిక దురాక్రమణకు సన్నాహాలు చేస్తున్నారు.(ఇరాన్ రాజధాని)టెహరాన్‌కు(సిరియా రాజధాని) డమాస్కస్‌ద్వారా దారి అన్న అవగాహనతోనే సిరియాలో అస్సాద్ ప్రభుత్వాన్ని కూలద్రోయటానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇరాన్‌పై తమ యుద్ధంలోకి భారత్‌ను కూడా లాగేందుకు అమెరికా సామ్రాజ్యవాదులు పూనుకున్నారు. ఇరాన్‌నుండి భారత్‌కు పైపులైనుద్వారా సహజ వాయువును సరఫరా చేసేందుకు జరుగుతున్న ఒప్పందాన్ని అడ్డుకున్నారు. అమెరికా వత్తిడితో భారత పాలకులు ఈ చర్యలను ఆపివేశారు. అణ్వాయుధాల తయారీకి తోడ్పడే సాంకేతిక పరిజ్ఞానమూ, పరికరాలను ఇరాన్‌కు ఎగుమతి చేయబోమని చెప్పారు.

దీనితో అమెరికా తృప్తిపడలేదు. ఇరాన్‌నుండి చమురు కొనుగోళ్లు ఆపివేయమని చెప్పింది. భారత్ దిగుమతి చేసుకుంటున్న చమురులో 30శాతం ఇరాన్ నుండి జరుగుతున్నది. ఇది దీర్ఘకాలిక ఒప్పందం. అందువల్ల ప్రపంచ మార్కెట్టులో చమురు ధరలు పెరిగినా, అంగీకరించిన తక్కువ ధరకే ఇరాన్ సరఫరా చేస్తున్నది. ఇప్పుడు ఇరాన్‌నుండి చమురు దిగుమతులు ఆపి, బహిరంగ మార్కెట్టు(అంటే అమెరికా కంపెనీల)నుండి కొనుగోలు చేస్తే భారత్ అధికధర చెల్లించాల్సివస్తుంది. దీనితో భారత పాలకులు వెనుక ముందాడుతున్నారు.

దీనితో భారత్‌ను ఇరాన్‌నుండి చమురు దిగుమతి చేసుకోకుండా చేయటానికి అమెరికా ఆర్థిక మీటలను బిగించింది. ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షల ప్రకారం అమెరికా బ్యాంకులు ఇరాన్‌తో ఆర్థిక లావాదేవీలను జరపరాదు. దీనినుపయోగించి అమెరికా బ్యాంకులు భారత్ ఇరాన్‌కు చెల్లించవలసిన డాలర్లను ఆపివేశాయి. యూరోపియన్ బ్యాంకులద్వారా చెల్లిద్దామని భారత్ ప్రయత్నించినా అమెరికా అడ్డుకున్నది. ఈ విధంగా ఇరాన్‌కు న్యాయంగా చేరవలసిన సొమ్మును అక్రమంగా ఆపివేసి ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసేందుకు పూనుకుంది.

దీనితో ఇరాన్ ప్రభుత్వం ముందుకు వచ్చి డబ్బు చెల్లింపులు లేకుండా వస్తుమార్పిడి పద్ధతిననుసరిద్దామని ప్రతిపాదించింది. ఈ పద్ధతిలో ఇరాన్‌నుండి దిగుమతి చేసుకున్న చమురు విలువకు సరిపడా ఇతర సరుకులను భారత్ ఆ దేశానికి ఎగుమతి చేయాలి. ఈ పద్ధతి అనుసరించినందువల్ల ఇరాన్‌తో భారత వాణిజ్యం పెరిగింది. ఈ విధంగా భారత్, చైనా, థాయ్‌లాండ్‌లు ఇరాన్‌తో వాణిజ్యంలో ముఖ్యస్థానాన్ని పొందాయి. భారత్ ఇరాన్‌కు బియ్యం, వినియోగ సరుకులను ఎగుమతి చేస్తున్నది. థాయ్‌లాండ్ ఇరాన్‌ల మధ్య చమురు, గనులు, భారీ పరిశ్రమల సేవలు, సాంకేతిక పరిజ్ఞానమూ, వ్యవసాయరంగాల్లో వాణిజ్యం సాగుతున్నది. ఆ రెండు దేశాలు గత ఏడాది సంయుక్త వాణిజ్య సమితిని ఏర్పాటు చేసుకున్నాయి. అలాగే చైనా ఇరాన్‌నుండి చమురు దిగుమతి చేసుకుంటూ, ఆయుధాలు, పరిశ్రమలు, సాంకేతిక పరిజ్ఞానమూ ఎగుమతి చేస్తున్నది.

ఈ వస్తుమార్పిడి పద్ధతికి కూడా అమెరికా ఆటంకాలు కల్పిస్తున్నది. దీనివల్ల భారత్‌నుండి దిగుమతి చేసుకున్న బియ్యానికి చెల్లించాల్సిన సొమ్ములో 15 కోట్ల డాలర్లు ఇరాన్ బకాయిపడింది. "దీనితో ఇరాన్‌తో వాణిజ్యానికి బియ్యం ఎగుమతిదారులు భయపడుతున్నార"ని అఖిలభారత బియ్యం ఎగుమతిదారుల **(తరువాయి 2వ పేజీలో)**

## మార్చి 8-అంతర్జాతీయ మహిళా దినోత్సవం వర్ధిల్లాలి!

# వృత్తిరక్షణకు, చేనేత కార్మికుల జీవన రక్షణకు పాలకులు, ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలి!

## ప్రస్తుత (2012-13) బడ్జెట్‌లో...

దేశంలో వ్యవసాయం తరువాత అతిపెద్ద ఉపాధి రంగంగా ఉన్న చేనేతకూ, ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1 లక్షా 77వేల మంది కార్మికులకు ప్రత్యక్షంగానూ, దాదాపు 2 లక్షల మందికి పరోక్షం గానూ అంటే దాదాపు 4 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేతకూ మరియు జౌళీరంగానికి కలిపి కేటాయించింది కేవలం 197.36 కోట్ల రూపాయలు. ఇది గత బడ్జెట్‌లో కేటాయించిన 392 కోట్లలో సరిగ్గా సగం మాత్రమే. ఇందులో విడుదలకు నోచుకునేది ఎంత? పూర్తిగా విడుదల చేస్తారనుకున్నా జౌళీ రంగానికి, చేనేత-జౌళీశాఖ అధికారుల జీతభత్యాలకు 40శాతం అంటే 80కోట్లు ఖర్చుయిపోతే చేనేత పరిశ్రమకు మిగిలేది ఎంత? ఇప్పటికే ప్రకటించిన ఋణమాఫీ, ఇతర సంక్షేమ పథకాలకు, బేస్‌మెంట్ వద్దే ఆగిపోయిన చేనేత పార్కుల నిర్మాణం పనుల అమలుకోసం ఈ నిధులు కేటాయిస్తే ఒక మూలకి కూడా రావు. మరి చేనేత రంగం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారానికి వృత్తిపై ఆధారపడ్డ కార్మికుల ఉపాధికి, జీవనభృతికి గ్యారంటీ ఏమిటి?

## గత బడ్జెట్‌ల అనుభవాలు

2005 నుండి 2011 వరకూ ప్రకటించిన ప్రతి వార్షిక బడ్జెట్‌లోనూ దాదాపు 300 నుండి 400 కోట్ల రూపాయలు ఈ రంగానికి కేటాయిస్తున్నట్లు చూపుతున్నప్పటికీ, ఆచరణలో ఏ బడ్జెట్‌లో కూడా పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయలేదు. 2009 ఎన్నికలకు ముందు 312 కోట్ల చేనేత కార్మికుల ఋణాలను మాఫీచేస్తామన్న పాలకులు అందుకోసం ప్రతి బడ్జెట్‌లో 300 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటిస్తున్నారే తప్ప ఋణమాఫీ చేయలేదు. 2011-12 వార్షిక బడ్జెట్‌లో 392 కోట్లు కేటాయించామని చెప్తూనే కేవలం 108 కోట్లు మాత్రమే విడుదల చేశారు. అందులోనూ 92 కోట్లు ప్రభుత్వ ఋణాలు, పాలకపార్టీ హంగుదార్ల జేబు సంస్థలైన సొసైటీలు తీసుకున్న ఋణాలను మాత్రమే రద్దుచేసి, ఆర్టిజన్ క్రెడిట్ కార్డు, పిఎంఆర్‌వై, రాజీవ్ యువశక్తి తదితర పథకాలద్వారా కార్మికులు తీసుకున్న వ్యక్తిగత ఋణాలను నామమాత్రంగా కేవలం 15 కోట్లు మాత్రమే రద్దుచేయటం దేనిని సూచిస్తుంది? ఈ పథకం పాలకుల రాజకీయ ప్రయోజనాలలో భాగమే కదా...ఈ వృత్తే ఆధారంగా జీవించే కార్మికులను గుర్తించ నిరాకరించటంకాదా! ఇది చేనేతను ఉద్దేశపూర్వకంగా ప్రక్కకు పెట్టడంలో భాగమే కదా.....

## చేనేత సంక్షోభం-ప్రభుత్వ, పాలకుల సృష్టే

నాడు బ్రిటీష్ పాలకులు నేతన్నల వ్రేళ్ళునరికిన తీరుగ నేటి మన పాలకులు చేనేతకు ప్రాణాధారమైన నూలు, రంగులు, రసాయనాల కొరత సృష్టించి, తద్వారా ధరలను అనేక రెట్లు పెంచి చేనేత పరిశ్రమ వెన్ను విరిచారు. హ్యాంకియార్న్ ఉత్పత్తి బాధ్యతను వదిలి వేశారు. ఫలితంగా ముడిసరుకుల కొరత, ఉద్పాదక వ్యయం పెరిగిపోయింది. ఉత్పత్తుల ధరలు పెరిగి, సాధారణ, మధ్యతరగతి ప్రజల కొనుగోలుకు పూర్తిగా దూరం చేయబడింది. అదే సమయంలో 'విదేశీ వస్త్ర బహిష్కరణ చేపట్టి స్వదేశీ ఖద్దరు వాడమని" జాతికి పిలుపునిచ్చిన గాంధీ వారసులైన పాలకులే నేడు ఆధునికత పేరుతో అధునాతన యంత్ర పరిశ్రమలు. జెట్‌లూములు, విదేశీ బహుళజాతి గుత్త కంపెనీలను దేశంలోకి తెచ్చి వారికి రాయితీలు, వారి ఉత్పత్తులకు సబ్సిడీలు ఇచ్చి చేనేతకు పోటీపెట్టారు.

పాలకుల ఈ పథకంవల్ల చేనేతకు పూర్తిగా ఆదరవు లేకుండాపోయింది. ఫలితంగా కార్మికుల జీవనం చిన్నాభిన్నం అయిపోయింది. కుటుంబమంతా రెక్కలరిగేలా చాకిరీ చేసినా కడుపునిండా తిండి దొరకని కారణంగా వేలాదిమంది కార్మికులు ఇతర వృత్తులకు పోతున్నారు. ఏటికేడాది పెరిగిపోతున్న అప్పులభారం, ఆకలి బాధలు తాళలేక రాష్ట్రంలో ఎటు చూసినా చేనేత కార్మికుల ఆకలి చావుల, ఆత్మహత్యల విషాదం మనల్ని వెంటాడుతూనే వుంది. పరిశ్రమ ఇంతటి సంక్షోభంలో ఉన్నా, కార్మికులు నిత్యం సమస్యలకు బలైపోతూవున్నా పాలకులకు చీమ కుట్టినట్లైనా లేదు.

నిరంతరం సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేస్తున్న పాలకులు, చిట్టిపొట్టి పథకాల గురించి ఆర్భాటంగా ప్రచారం సాగిస్తూ, కార్మికుల ఆలోచనలను వాటి చుట్టూతా త్రిప్పుతూ శాశ్వత పరిష్కారం అన్న ఊసే ఎత్తడంలేదు. పైపెచ్చు చేనేతను ఒక క్రమపద్ధతిలో ధ్వంసంచేస్తూ బడాపెట్టుబడిదారుల, విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి ఊడిగం చేస్తూ వారి కంపెనీలు వేగంగా విస్తరించటానికి శాయశక్తులా కృషి చేస్తున్నాయి.

***మిత్రులారా!*** పాలకులనుసరిస్తున్న ఈ దళారీ విధానాల నేపథ్యంలో వారు చెప్పే చిట్టిపొట్టి పథకాలు, బడ్జెట్ కేటాయింపులు వృత్తికి, కార్మికులకు ఎలాంటి మేలు చేకూర్చలేవు. కార్మికులమైన మన జీవితాలు మెరుగు పడాలంటే మన ఆదాయాలు, వేతనాలు పెరగాలి. అపుడు మాత్రమే మనం వృత్తిలో నిలదొక్కుకో గల్గుతాము. తద్వారా మాత్రమే వృత్తి రక్షింపబడుతుంది. అందుకోసం చేనేతను ధ్వంసం చేయటంకోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న దళారీ విధానాలకు వ్యతిరేకంగా ఈ వృత్తే ఆధారంగా జీవించే కార్మికులందరూ సంఘటితంగా పోరాడాలని పిలుపునిస్తున్నాం!

- ప్రభుత్వం చేపట్టిన విధానాల ఫలితంగా ఆకలి చావులకు, బలవన్మరణాలకు గురైన చేనేత కార్మిక కుటుంబాలకు మా సంతాపం తెలియజేస్తున్నాము.
- చేనేత కార్మికులు ఈ వృత్తిలో నిలద్రొక్కుకోడానికి, తద్వారా వృత్తిని రక్షించుకోడానికి ప్రభుత్వం ప్రతి ఒక్క చేనేత కుటుంబానికి 10వేల రూ॥లు తక్షణ సహాయం అందించాలి.
- హ్యాంకి యార్న్ ఉత్పత్తిని పెంచి, నూలు, రంగులు, రసాయనాల ధరలను తగ్గించి ఉత్పాదక వ్యయభారం తగ్గించాలి.
- చేనేత కార్మికుల కనీస వేతనాన్ని 10 వేలుగా నిర్ణయించాలి. పటిష్టంగా అమలుచేయాలి.
- రాష్ట్రంలోని చేనేత వృత్తిపై ఆధారపడిన వారందరికీ ఉత్పత్తికి ఆధారం (పని) కల్పించి, ఉత్పత్తిపై తగిన వేతనాలు సమకూర్చి, ఉత్పత్తులన్నింటినీ ప్రభుత్వ సంస్థలే సేకరించుతూ చేనేతకు వృత్తి రక్షణ, కార్మిక కుటుంబాలకు జీవన రక్షణ కల్పించాలి.
- కార్మికులపై ఉన్న ప్రభుత్వ ఋణాలను తక్షణమే రద్దుచేయాలి.
- వయోవృద్ధులైన చేనేత కార్మికులకు నెలకు 1000 రూ॥లు పెన్షన్ ఇవ్వాలి.

**ప్రజాతంత్రచేనేతకార్మికసంఘం(ఆం.ప్ర.)**
**అఖిలభారతకార్మికసంఘాలసమాఖ్య(న్యూ)అనుబంధం**

## 2012 జాతీయ...(మొదటి పేజీ తరువాయి)

అంటే కూల్‌డ్రింకులు అమ్మే పెప్సిలాంటి కంపెనీ కొంత రుచి వచ్చే రసాయనాన్ని, కొన్ని గ్రాముల పంచదారనూ కలిపిన నీటిని లీటరు రూ.50లకు అమ్మగలుగుతుంది. కాగా సాగు చేసే రైతు, లీటరు నీటికి పైసాకంటే తక్కువే చెల్లిస్తాడు. కనుక రైతుకిచ్చే సాగునీటిని పెప్సికంపెనీకి మరల్చటమే నీటినుండి అధిక విలువను రాబట్టడమవుతుంది. ఇదే అమలు జరిగితే "అధిక విలువ" రాబట్టడం కోసం నీటిని పరిశ్రమలూ, కొన్ని వాణిజ్య సంస్థలూ స్వాధీన పరుచుకుని రైతాంగానికి, పట్టణ పేదలకు అందకుండా చేసే విధానమే అమలవుతుంది.

జల విధాన ముసాయిదా నీటి కేటాయింపుల అమ్మకాలు-కొనుగోళ్ళ గురించి సూటైన మాటల్లో చెప్పనప్పటికీ, "సమర్ధవంత వినియోగం", "అధిక విలువ రాబట్టడం" వంటి అవగాహనలు దానిలో విడదీయలేని భాగంగా వున్నాయి. దీని విపరీత పరిణామాలు "సంస్థాపర ఏర్పాట్లు" అన్న శీర్షికవున్న విధానంలోని సెక్షను 13లో స్పష్టంగా కన్పిస్తాయి.

సెక్షను13.1 ఇలా పేర్కొంది: "ప్రతిరాష్ట్రంలో జల క్రమబద్ధీకరణ ప్రాధికార సంస్థను ఏర్పరచాలి...నీటి సరఫరా ఛార్జీలను అది నిర్ణయించటం"తో పాటుగా "జల కేటాయింపులను నిర్ధారించడమూ వాటి నిర్వహణను పర్యవేక్షించడమూ, వాటి పనితీరును సమీక్షించడమూ అది చేయాలి."

అంటే ఒక ప్రాధికార సంస్థ నీటి కేటాయింపులనూ, ధరలనూ నీటినుండి అధిక విలువను రాబట్టే విధంగా నిర్ణయించి అమలు చేస్తుంది.

అంతేకాదు. ఈ ప్రాధికార సంస్థ ఏర్పడిన తర్వాత "నీటినందించే ప్రభుత్వపు సేవలందించే పాత్రను క్రమబద్ధ పాత్రగా మార్చుకోవాలి. నీటివనరుల వినియోగప్రణాళిక రచన, అమలు, నిర్వహణకు బాధ్యత నిచ్చిన సంస్థలను పటిష్టపరచాలి. నీటి సంబంధ సేవలన్నింటినీ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యపు తగిన రూపంలో బృందానికీ లేక ప్రైవేటు రంగానికీ అప్పగించాలి." (సెక్షన్ 13.4)

సమాజ సభ్యులైన ప్రజలందరికీ నీటిని అందుబాటులో వుంచాల్సిన బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకుంటుంది. ఇది విధాన ముసాయిదా అంగీకరించిన "ప్రజానిధి" అవగాహనకు వ్యతిరేకం. నీరు ఏ ఒక్కరి ప్రైవేటు ఆస్థికాదన్న అవగాహనకు విరుద్ధంగా, నీటి వినియోగ ప్రణాళిక రచన, అమలు, నిర్వహణలను ప్రైవేటు పెట్టుబడికి అప్పగించడమంటే అది నీటిపై ప్రైవేటు ఆస్థి హక్కును స్థిరపరచడమే! ప్రైవేటు వ్యక్తులకు లేదా కంపెనీలకూ నిర్వహణలో పాత్రనిస్తున్నాము తప్ప ఆస్థి హక్కులు కల్పించడంలేదని పాలకులు వాదించవచ్చు. వాదనెలావున్నా ఆస్థి హక్కుకి దారి తీస్తుందనడానికి ఉదాహరణ శివనాథ్ నది. ఛత్తీస్‌ఘడ్‌లోని ఈ నదిపై డ్యాము నిర్మించి, నీటిని బొరాయి పారిశ్రామిక వాడకు తరలించేందుకు 25 ఏళ్ళ 'నిర్మించు, నిర్వహించు బదిలి చేయి' పద్ధతిలో ఒక ప్రైవేటు కంపెనీకి అనుమతినిచ్చారు. ఆ కంపెనీ నదికి 23 కిమీ పొడవునా తాగటానికీ, స్నానం చేయడానికీ కూడా శివనాథ్ నది నీటిని వాడరాదని ఆంక్షలు పెట్టింది. నది ఒడ్డునుండి కిలోమీటరు వరకూ గల బావులు, బోర్లలోని నీరు, డ్యాము జలాశయంనుండి ఊరినది కనుక మూసివేయాలనీ లేదా వాడుకుంటే శిస్తు చెల్లించాలనీ ఆదేశించింది. ఆ విధంగా ప్రజల సమిష్టి జలవనరు ప్రైవేటు ఆస్తిగా మారిపోయింది.

కొన్ని నగరాలూ, పట్టణాల్లో నీటి సరఫరాను ప్రైవేటీకరించే పైలట్ ప్రాజెక్టులవల్ల ఆ ప్రాంత ప్రజలు ఇతర వనరుల నుండి నీరు పొందకుండా నిరోధించే అవకాశం ఏర్పడింది. మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా పట్టణంలో నీటి సరఫరాను ప్రైవేటు కంపెనీకిచ్చారు. ఒప్పంద పత్రంలో మరో పోటీ నీటి సౌకర్యం ఉండరాదని నిబంధన ఉంది. నీటి సౌకర్యం అన్న పదాన్ని నిర్వచించలేదు. కనుక ఆ కంపెనీ ఇళ్ళలో వున్న బావులు, బోర్లనుండి నీటిని పొందరాదని ఆంక్ష విధించగలదు. బొలివియా లోని కొచబాంబాలో ఇదే జరిగింది. దానితో ప్రజలు ఆగ్రహించి తిరగబడ్డారు.

ఈ తిరుగుబాట్ల భయంనుండి దొడ్డిదారులు వెతకడం మొదలుపెట్టారు. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నీటి ఛార్జీలను పెంచివేసింది. వారం రోజులూ 24 గంటలు నీటి సరఫరా చేస్తానని ప్రచారం చేసింది. ఆ తర్వాత ఇళ్ళలో వేసుకున్న బోరుబావులపై ఛార్జీలు వేసి (అవి లేకపోతే తన నీరెంత అదనంగా వాడుకుని వుండేవారు అన్న అంచనాతో) వాడుకోని నీటికి కూడా అదనపు ఛార్జీలను వసూలు చేస్తున్నది. ఆ విధంగా ప్రజలు తమ స్వంత వనరు నుండి నీరు పొందకూడదనీ, పొందితే శిస్తు కట్టాలనీ శాసించారు. ఎవరికైనా తమ స్థలం లేదా పొలంలో బోరు వేసుకుని నీరు తోడుకునే చట్టపరమైన హక్కు వుంది. భూగర్భ జలవనరులు తరిగిపోతున్నాయన్న సాకుతో, దాని నివారణకంటూ తన స్థలం, పొలంలోని భూగర్భజలాలపై హక్కులేకుండా కొత్త చట్టాన్ని చేయాలన్న ప్రతిపాదన కూడా ప్రభుత్వ పరిశీలనలో వున్నట్లు తెలుస్తోంది. ఇలా త్రాగునీటి ఛార్జీలను పెంచాలన్న ప్రపంచ బ్యాంకు ఆదేశాలను ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పురపాలక సంస్థలూ అమలు పరిచే క్రమంలో వున్నాయి. నీటి ఛార్జీలు పెంచడంతోపాటు పేదల వాడలలోని కుళాయిలనుకూడా తొలగిస్తున్నాయి.

విద్యుత్ రంగంలో జరిగిన పరిణామాలే నీటి రంగంలోనూ జరగబోతున్నాయని జలవిధాన ముసాయిదా తెలుపుతున్నది. విద్యుత్ రంగ ప్రైవేటీకరణ, విద్యుత్ సరఫరాను మెరుగుపరిచింది లేదు. కాగా, విద్యుత్ ప్రాధికార సంస్థ మాత్రం వాడుకున్న కరెంటుకూ, వాడుకోని కరెంటుకు కూడా ఛార్జీలు పెంచి వసూలు చేస్తున్నది. అలాగే జలవిధాన ముసాయిదా అమలులోకి వస్తే అది పేదలకూ, రైతాంగానికీ నీటిని అందుబాటులో లేకుండా చేస్తుంది. ప్రైవేటు కంపెనీల లాభార్జనకు ప్రజల సమిష్టి వనరులను ప్రైవేటు ఆస్తిగా కట్టబెడుతుంది. ఆ విధంగా నీరు వాణిజ్య సరకుగా మారి, కొనగలిగిన వారికే అందుబాటులో ఉంటుంది.

ప్రజల జీవనానికీ, ఆహారానికీ, జీవనోపాధికీ జల విధాన ముసాయిదా ఒక పెను ప్రమాదంగా వుంది. ఇది పేద ప్రజలకూ, రైతాంగానికీ వ్యతిరేకమైనదే కాక, అత్యధిక ప్రజలందరి ప్రయోజనాలకూ హానికరమైనది. ఇది విధానంగా మారి అమలుకాకుండా తుదికంటా పోరాడాలి. N

## ఇరాన్‌పై...(మొదటి పేజీ తరువాయి)

సంఘం అధ్యక్షుడు ప్రకటించారు. ఏమైనా అమెరికా కోరినట్లు ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలకు భారత పాలకులు సిద్ధపడలేదు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలో ఇజ్రాయిలు కారుపై బాంబు దాడి ఘటనను చూడాలి.

ఢిల్లీలో భారత ప్రధాని నివాసానికి కూతవేటు దూరంలో ఇజ్రాయిలు రాయబారి కార్యాలయంలోని సైనిక సలహాదారు భార్య ప్రయాణిస్తున్న కారు ప్రేలిపోయింది. ఢిల్లీ పోలీసులు రెండుగంటలపాటు సంఘటనా స్థలానికి రాలేదు. కారుకు ఇంధనంగా వాడుతున్న గ్యాసు సిలిండర్ ప్రేలి ప్రమాదం జరిగిందని వారు మొదట చెప్పారు. అయితే "అతుక్కునే బాంబు"ను మోటారు సైకిలుపై వచ్చిన వ్యక్తులు కారుకు అతికించి వెళ్లారనీ, ఇది ఇరాన్ చేసిన పనేననీ ఇజ్రాయిలు ప్రకటించింది. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లోనూ, జార్జియా రాజధాని తిబిలిసిలోనూ ఇలాంటి బాంబు దాడులే ఇజ్రాయిలు అధికారులపై జరిగాయనీ ''ఇరాన్, దాని వకాల్తాదారులు ఈ దాడులకు పాల్పడ్డారన్నది నిర్వివాదమ''ని ఇజ్రాయిలు రక్షణమంత్రి ప్రకటించాడు.

ఇలా దాడికి పాల్పడ్డారని ఒక ఇరాన్ పౌరుడిని థాయిలాండ్ పోలీసులు అరెస్టు చేశారు. అయితే వారు ఇరాన్‌కు చెందిన అంతర్జాతీయ టెర్రరిస్టు ముఠాతో సంబంధం కలిగివున్నారనటానికి సాక్ష్యాలు లేవని థాయి అధికారులు అన్నారు. కాగా ఢిల్లీలోనూ, జార్జియాలోనూ దాడిచేసిన వారెవరో ఇంకా గుర్తించలేదు. ఇజ్రాయిలు వాదనను భారత ప్రభుత్వం ఇంతవరకూ అధికారికంగా ఖండించటమో, సమర్థించటమో చెయ్యలేదు. భారత పత్రికలు మాత్రం ఇజ్రాయిలు కథనానికి ప్రాముఖ్యతనిచ్చి ప్రచారం చేశాయి.

"అతుక్కునే బాంబు" అంటే ఒక అయస్కాంతం ద్వారా బాంబును కారుకు తగిలిస్తారు. ఢిల్లీలో మోటారు బైకుపై కారుప్రక్కనే వెళుతూ బాంబును అతికించారు. కాగా జార్జియాలో ఆగివున్న కారు క్రింద బాంబును అతికించారు. ఈ దాడులు వేటిలోనూ ప్రయాణిస్తున్న వారెవరికీ పెద్దగా గాయాలు కాలేదన్న అంశాన్ని ముఖ్యంగా గమనించాలి.

ఈ "అతుక్కునే బాంబు"తో హత్యాకాండను సాగించింది, మొదటగా ఉపయోగించిందీ ఇజ్రాయిలే. ఇలా నలుగురు ఇరాన్ అణుశాస్త్రజ్ఞులను ఇజ్రాయిలు హత్యచేసింది. జనవరి నెలలో టెహరాన్ నగరంలో ఇరాన్ అణుశాస్త్రజ్ఞుడు ముస్తాఫా అహ్మదీరోషన్ ప్రయాణిస్తున్న కారుకు మోటారు సైకిల్‌పైవచ్చి అతుక్కునే బాంబు పెట్టగా ఆయన తునాతునకలయ్యాడు. మిగిలిన ముగ్గురు శాస్త్రవేత్తలూ కూడా ఇలాగే మృతి చెందారు. కొందరు ఇరానియన్‌ల ద్వారా అమెరికా గూఢచారిసంస్థ, ఇజ్రాయిలు కలిసి ఈ హత్యాకాండ సాగించాయని సాక్ష్యాధారాలతో ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది.

భారత్, థాయిలాండ్, జార్జియాలలో జరిగిన దాడులతో తమకెలాంటి సంబంధమూ లేదనీ ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. అమెరికా ఆంక్షలవల్ల ఏర్పడిన ఇబ్బందులలో తనకు సహాయపడుతున్న దేశాలలో ఇలాంటి దాడులు చేయించినందువల్ల ఇరాన్‌కెలాంటి ప్రయోజనమూ లేకపోగా హాని జరుగుతుందని ఎవరికైనా అర్థమౌతుంది.

ఈ రకపు దాడులకు ఇజ్రాయిలు గతంలో పాల్పడివుంది; దాడులు జరిగిన దేశాలన్నీ ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలు కలిగివున్నాయి. దాడికి గురైన వారి దేశం ఇజ్రాయిలుతో ఈ దేశాలు వేటికీ శతృత్వంలేదు. టెర్రరిస్టు దాడే అయితే వినాశకరంగా వుండాలి. అలా జరగలేదు. దాడికి గురైన వారు సాయంత్రానికి ఇంటికి చేరారు. వారెవరూ ఇజ్రాయిలు ముఖ్యఅధికారులూ కాదు. కాగా ఈ దాడులు సాధించిందేమిటి?

ఇరాన్ టెర్రరిస్టు చర్యలకు పాల్పడుతున్నదన్న అవాస్తవాన్ని ప్రజలతో నమ్మించటం ఒక ప్రయోజనం కాగా, మరొకటి ఇరాన్‌పై దురాక్రమణను టెర్రరిజంపై పోరులో భాగంగా చూపే సాకును సృష్టించటం. ఇవి రెండూ అమెరికా దురాక్రమణ లక్ష్యాలకూ అనుగుణంగానే వున్నాయి.

ఇక అమెరికా సామ్రాజ్యవాదుల ఆర్థిక, రాజకీయ ఒత్తిడులకు భారత పాలకులు లొంగిపోరాదని భారత ప్రజలు డిమాండు చేయాలి. N

# మా అమ్మ జ్ఞాపకాలు (ఏప్రిల్ 5, 1944)

**ఛూ టే**

**మా** అమ్మ చనిపోయిన వార్త నన్ను అగాధంలోకి త్రోసేసింది. అమ్మంటే నాకెంతో ప్రేమ. ఆమెతో ఎన్నో విలువైన జ్ఞాపకాలు, జీవించినంతకాలం ఆమె కాయకష్టం చేసిన జ్ఞాపకాలు ఎన్నో వున్నాయి.

మాది కౌలు రైతుల కుటుంబం. మా పూర్వీకులు దుయాంగ్‌డాంగ్ రాష్ట్రంలోని షావోగులీన్‌లో ఉండేవారు. సియాచిన్ ప్రాంతానికి సామూహిక వలసలుగా ప్రజలు వెళ్ళిన కాలంలో మా పూర్వీకులు ఆ రాష్ట్రంలోని యిలాంగ్‌కౌంటీలోని మాన్‌బాంగ్‌కు తరలివెళ్ళారు. అక్కడ మా పూర్వీకులు కొన్ని తరాల పాటు భూస్వాముల భూములు దున్ని, సాగుచేసి పేదరికంలో మగ్గుతూ ఉండేవారు. మా స్నేహితులు కూడా అర్ధాకలితో మల మల మాడుతూ ఉండేవారు. వారు నిరాడంబరులు, నిజాయితీ పరులు.

మా అమ్మకు 13 మంది సంతానం. వీరందరికీ సరైన ఆహారం ఇవ్వలేని పేదరికం వల్ల ఎనిమిది మంది మాత్రమే బ్రతికి బట్టకట్టాం. ఆ తర్వాత పుట్టిన వారిని నీళ్ళలో ముంచి చంపేయడమే. ఆనాటి పరిస్థితులలో మా అమ్మ అలా చేయకతప్పలేదు. అయినా ఇదంతా మా అమ్మకు ఎంతో వేదన కలిగించే విషయమే. తనొక్కతే మా ఎనిమిది మందిని పెంచింది. అయితే ఆమె రోజంతా ఇంటి పనీ, వ్యవసాయపు పనిలో మునిగిపోయి మా గురించి ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన సమయమే లేకపోవడంతో మేము గాలికి పెరిగాం.

మా అమ్మ చాలా కాయకష్టం చేసే మనిషి. నాకు జ్ఞాపకం వున్నంత వరకు ఆమె తెల్లవారకముందే లేచి పనిలో పడేది. 20 మందిపైగా వున్న మా కుటుంబంలో ఉదయపు ఉపాహారాన్ని ఇంట్లో వున్న ఆడవాళ్ళు వంతుల వారీగా తయారుచేసేవారు. ఒక్కొక్కరు సంవత్సరంపాటు చేసేవారు. అన్నంవడిన తర్వాత మా అమ్మ పొలంలో కూరగాయల తోటలో పనితోపాటు పందులను, పట్టుపురుగుల సంరక్షణ చేసి, నూలు వడికేది. మా అమ్మ పొడగరి, శరీర సౌష్టవం కల్గిన ఆమె కావడంతో ఆమె నీళ్ళు మోసుకురావడమేకాక ఎరువులు కూడా మోసేది.

మా అమ్మ రోజంతా అలా పనిచేసేది. నాకు నాలుగైదేళ్ళ వయసులో సహజంగానే పనిచేస్తున్న మా అమ్మ ప్రక్కనే ఉండేవాడిని, ఎనిమిది, తొమ్మిదేళ్ళు వచ్చిన తర్వాత నేను నీళ్ళుతేవడం, తట్టలు మోయడమేకాక పొలంలో పనీ చేసేవాడిని. సాయంత్రంపూట ఊరిలోని ప్రైవేటు స్కూలు నుంచి తిరిగి వచ్చేటప్పటికి, మా అమ్మ పొయ్యిదగ్గర చెమటలు కక్కుతూ ఉండేది. నేను నా పుస్తకాలు ఒక చోట పెట్టి, నీళ్ళు తేవడానికో, ఆవులను మేతకు వదలడమో చేసేవాడను. ఒక్కో సారైతే నేను ఉదయం చదువుకొని, మధ్యాహ్నమంతా పొలంలో పనిచేసేవాడిని. పొలం పనులు ముమ్మరంగా వున్న కాలంలో ఐతే నేనూ మా అమ్మతోపాటు రోజంతా పొలంలో పనిచేసేవాడిని. ఈ కాలంలోనే అమ్మ నాకు వ్యవసాయం గురించి ఎన్నో విషయాలు నేర్పింది.

కౌలు రైతుల కుటుంబాల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అయినా మా అమ్మ సమర్ధురాలు, తెలివిగలది కావడం వల్ల మేం అలా నెట్టుకు వచ్చాం. దీపాలకు పనికి వచ్చే నూనెను ఒకరకం కర్రనుంచి తయారు చేసేవారం. అన్నంలో ప్రధానంగా బఠానీలు, ఆకుకూరలు, తియ్యటి బంగాళాదుంప, గోధుమ, బియ్యం కాక మిగిలిన ధాన్యాలు వాడేవాళ్ళం. రేప్ గింజలనూనె మేము మా ఇంట్లో తయారు చేసుకునేవాళ్ళం. భూస్వాములు, ధనికులు అటువంటి ఆహారం వైపు కన్నెత్తిచూసేవాళ్ళుకాదు. కానీ మా అమ్మ మాత్రం దానిని ఉపయోగించుకొని మా మొత్తం కుటుంబానికి రుచికరమైన ఆహారాన్ని తయారుచేసి పెట్టేది. పంటలు బాగా పండినప్పుడే మేము మా గుడ్డలు మేమే తయారు చేసుకునేవారం. మా అమ్మ నూలు వడికి, దానిని వస్త్రాలుగా నేసి, అద్దకం వేయడానికి ఇతరుల సహాయం కోరేది. ఈ వస్త్రాన్ని కుటుంబ తయారీగా మేము పిలిచేవారం. రాగి నాణెమంత దళసరిగా ఉండేది. ఈ గుడ్డతో తయారుచేసిన దుస్తులు చిరిగిపోకుండా చాలా మంది పిల్లలు ఒకరితర్వాత మరొకరు వేసుకోవడానికి వీలుగా వుండేవి.

మా కుటుంబం బాగా కష్టపడేది. క్రమశిక్షణా యుతంగా, నిర్మాణయుతంగా ఉండేది. మా తాతగారు చైనా రైతాంగానికి ప్రతీక. 80ఏళ్ళు దాటిన తర్వాత కూడా పొలాల్లో పని చేసేవాడు. అలా పనిచేయకపోతే ఆయన అనారోగ్యం పాలయ్యేవాడు. ఆయన చనిపోయే చివరి రోజు వరకు పనిచేశారు. మా అవ్వ కుటుంబ వ్యవహారాలుచూసేది. వసంత ఉత్సవ కాలంలో ఆమె మొత్తం సంవత్సరానికి సంబంధించిన ఉత్పత్తి కార్యక్రమం రూపొందించేది. రోజూ, తెల్లవారక మునుపే లేచే వాళ్ళలో మా అమ్మ మొదటిది. ఆ తర్వాత మా తాత మేలుకొనేవాడు. మిగిలిన వాళ్ళు అప్పుడు లేచేవారు. ఎవరి పనిలోకి వారు వెళ్ళేవారు. పందులను మేపటం, కట్టెలు కొట్టడం, నీళ్ళు మోసుకురావడం లాంటి పనుల్లో మునిగిపోయేవారు. మా కుటుంబం మొత్తంలో మా అమ్మ ఏమీ గొణుక్కుండా కష్టమైన పనులుచేసేది. ఆమె దయార్ద్ర హృదయురాలు. ఎవర్నీ నిందించేదికాదు. ఎవరితోనూ ఎప్పుడూ కొట్లాడేది కాదు. కనుకనే, బంధువులు, కోడళ్ళు, యువకులు, వయసుమళ్ళిన వాళ్ళతో నిండిన మా పెద్ద కుటుంబంలో అందరం చక్కటి సామరస్యంతో ఉండేవాళ్ళం. మా అమ్మ పేదవారిపట్ల జాలి చూపేది. అది వర్గపరంగా వచ్చిన సానుభూతిగా అనుకోవచ్చు. మేమంత వున్నవాళ్ళం కాదు. అయినా అవసరమున్న బంధువులందరినీ ఆమె ఆదుకునేది. మా నాన్న అప్పుడప్పుడు పొగత్రాగినా, మద్యం త్రాగినా ఇతరులెవ్వరూ వాటిజోలికి పోకుండా మా అమ్మ కట్టడి చేసింది. ఆమె శ్రమ చేసేతత్వం, ఆమె ఉదారత్వం, మంచితనం నాకు ఈ రోజుకీ గాఢమైన ప్రభావాన్ని కలిగించాయి.

అంటే అర్ధం-చైనా వారంతా కాయకష్టం చేసే వారైతే చైనా రైతులకు కష్టాలు రావని అర్థంకాదు. శతాబ్దపు చివర్లో వరుసగా చాలా ఏళ్ళపాటు సిచువాన్ ప్రాంతం వర్షాభావ స్థితిని అనుభవించింది. పస్తులు, విధ్వంసం రైతాంగ జీవనాన్ని దెబ్బ కొట్టాయి. కొందరు రైతులైతే, ఒక బృందంగా ఏర్పడి ధనికులనుండి ఆహారం గుంజుకునేవారు. ఆరేడువందల చింపిరి గుడ్డల రైతులు, వారి పిల్లలు, భార్యలను అధికార బృందాలనేవారు చావబాది, చంపివేయడం నేను కళ్ళారా చూశాను. 20-25 కిలోమీటర్ల చుట్టూ వారి రక్తం వెదజల్లబడి ఉండేది. వారి కేకలు ఆకాశానికి చిల్లులు పడేంతగా వుండేవి. ఈ సమయంలో నా కుటుంబం మరింత కష్టాల పాలైంది. సంవత్సరాల తరబడి ఆకుకూరలు తిని బ్రతకాల్సి వచ్చింది. బియ్యం లేవు. 1895లో ఐతే మమ్మలను భూమి నుండి వెళ్ళగొడతారని బెదిరించారు. వసంత ఉత్సవ కాలంలో మా ఇంటినుంచి వెళ్ళగొట్టారు. కౌలురైతుల కౌలును పెంచడంలో విఫలుడైన తర్వాత ఇదంతా చేశాడు. ఈ దుర్భర పరిస్థితులలో మా కుటుంబం రోదిస్తూ చీకటిలో కలిసిపోయింది అప్పటినుంచి మేము విడిగా రెండు ప్రాంతాల్లో ఉండటం ప్రారంభించాం. మేము కొన్నాళ్ళు పంటలు పండించలేక పోయేవారం. అదంతా అత్యంత దుర్భరమైన అనుభవం. కాని అమ్మ మాత్రం తన ధైర్యాన్ని కోల్పోలేదు. పేద రైతుల పట్ల ఆమెకు జాలి, దయ ఇనుమడించింది. వీరిని పట్టించుకోని ధనికులపై ద్వేషం రెట్టింపైంది. మా అమ్మ చెప్పిన చేదు అనుభవాలు, నేను కళ్ళారా చూసిన అన్యాయాలు నా యువ హృదయంలో అణచివేతపట్ల ప్రతిఘటనా చైతన్యాన్ని కలుగజేశాయి. కనుక ఒక నూతన జీవితాన్ని కనుగొనాలని నిశ్చయించుకున్నాను.

ఆ తర్వాత నేను ఇల్లు వదిలి పాఠశాలలో చేరాను. ఒక కౌలురైతు బిడ్డగా నా చదువుకు సరిపోయే డబ్బు లేదని, అయినా సరే భూస్వాముల హింస, వారి నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ కుటుంబాన్ని ఆదుకునే ఒక "స్తంభం"లాగా నిలబడతానన్న భావంతో నా తల్లిదండ్రులు పచ్చడి మెతుకులు తింటూ, చింపిరి గుడ్డలు ధరిస్తూ నన్ను చదివించారు. ప్రైవేటుగా గ్రామంలోని స్కూలులో విద్య ముగించి, 1905లో (చింగ్ వంశపు గుయాంగ్ క్సు సామ్రాట్టు పాలనయొక్క 31వ సంవత్సరంలో) నేను ఇంపీరియల్ పరీక్షలు ప్యాసై మొదట్లో ఇంకా దూరంగా వున్న ఫున్‌చంగు, ఆ తర్వాత చెంగ్‌టుకు చదువు కొనసాగించడానికి వెళ్ళాను. మొత్తం మీద నా చదువుకు అయిన ఖర్చు 200 డాలర్లపైగా-దీనిని పలువురు దగ్గర అప్పుచేసి నాకు పంపారు. నేను యునాన్ సైన్యంలో బ్రిగేడ్ కమాండర్ అయ్యేవరకు ఆ అప్పును నేను తీర్చలేకపోయాను.

1908లో నేను చెంగ్‌డు వదిలి, యిలాంగ్ అనే ఒక చిన్న పట్టణానికి తిరిగి వచ్చి, పలువురు స్నేహితులతో కలిసి ఒక ప్రాథమిక పాఠశాలను నడిపాను. ఆ ఏడాది మా అమ్మను చూడటానికి మా ఇంటికి రెండు మూడుసార్లు వెళ్ళగల్గాను. పాత, కొత్త భావాల నిశితమైన సంఘర్షణ జరుగుతోంది. విజ్ఞాన శాస్త్రం గురించి, ప్రజాస్వామ్యం గురించి నేర్చుకున్న కొత్త భావాలతో మా పట్టణానికి ఏదో కొంత మేలు చేయాలనుకున్నాం. సనాతన స్థానిక నాయకులు, నిరంకుశ జమీందారులు మాకు వ్యతిరేకులుగా నిలబడ్డారు. దీనితో మా అమ్మకు చెప్పకుండా, దూరంగా వున్న యునాన్ ప్రాంతంలోని నూతనమైన సైన్యంలో చేరడానికి వెళ్ళాలని నిశ్చయించు కున్నాను. నేను యునాన్ వెళ్ళిన తర్వాత మా అమ్మ నేను తీసుకున్న నిర్ణయాన్ని అభినందించిందని తెలిసింది. ఆమె నన్ను ప్రోత్సహిస్తూ కబురు పంపింది.

చింగ్ సమ్రాట్టు యువాన్‌టాంగ్ మొదటి సంవత్సరం పాలన నాటినుండి అంటే 1909 నుండి నేను ఇంటికి తిరిగి వెళ్ళలేదు. నా తల్లిదండ్రులను నా దగ్గరకు 1919లో తీసుకు వచ్చాను. కాని వారు వ్యవసాయం చేసే అలవాటు పడినవారు. కనుక అక్కడ అసౌకర్యంగా వుండటం చేత, తిరిగి వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు. మానాన్న తిరిగి వెళ్తూ త్రోవలోనే చనిపోగా, మా అమ్మ చనిపోయే వరకు శ్రమ చేస్తూనే ఉంది.

మా అమ్మ బతికినంతకాలం శ్రమ చేస్తూనే ఉంది. నేను పుట్టడానికి ముందు క్షణం వరకు ఆమె పొయ్యి దగ్గరే వుంది. వయసు పైబడ్డా కూడా, పొలాల్లో పనిచేయడం ఆమెకెంతో ఇష్టం. గత ఏడాది మరో మేనల్లుడు ఇలా రాశాడు. "అమ్మమ్మ వయసు పెరుగుతున్న కొద్దీ ఆమె ఆరోగ్యం మునుపటిలా ఉండటం లేదు. అయినా ఆమె పనులు చేయడం మానడం లేదు. ప్రత్యేకంగా నూలు వడకడం పట్ల ఎంతో ఇష్టంగా చేస్తోంది."

కష్టాలను ఎదురొడ్డి పోరాటంతో ఆమె అనుభవాన్ని మా అమ్మ నాకు అందించినందుకు ఆమెకు కృతజ్ఞుడ్ని. ఇంట్లో అంతులేని కష్టాలు అనుభవించాను. కనుక 30 ఏళ్ళపైగా వున్న నా మిలటరీ జీవితం, విప్లవ దినాలు నాకేమీ కష్టమనిపించలేదు. ఏ ఇబ్బంది వచ్చినా దానికి నేనేనాడు భయపడలేదు. మా అమ్మ నాకు దృఢమైన ఆరోగ్యవంతమైన శరీరాన్ని ఇవ్వటమే కాక, ఎన్నో మంచి అలవాట్లు నేర్పినందున ఏనాడూ నేను దిగాలు పడలేదు.

వ్యవసాయం నేర్పినందుకూ, ఒక ధృఢమైన విప్లవాత్మక కాంక్షను నాలో రగిలించినందుకు, విప్లవ మార్గం చేపట్టడానికి ప్రోత్సహించినందుకు మా అమ్మకు నేను సదా కృతజ్ఞుడ్ని అయి ఉంటాను. ఈ విప్లవ మార్గంలో గడుపుతున్న ప్రతి రోజూ నేను నేర్చుకున్న ఈ పాఠాలను ఏమాత్రం మరువను.

మా అమ్మ ఇప్పుడు నన్ను వదలి వెళ్ళిపోయింది. ఆమెను ఇక నేను చూడలేను. మందులేని దుర్భరమైన విషాదం అది. లక్షలాది చైనా శ్రామిక జనావళిలో ఆమె ఒక సాధారణ వ్యక్తి. కానీ చైనా చరిత్రను సృష్టించిందీ, ఇంకా కొత్తగా సృష్టిస్తున్నదీ ఈ ప్రజలే. మా అమ్మ చూపిన మహత్తరమైన దయార్ద్ర హృదయానికి నేను ఎలా బాకీ తీర్చుకోగలను?! మా అమ్మలాంటి ఎందరో ఆనందంగా జీవించడం కోసం కృషి చేస్తున్న దేశానికి, ప్రజలకు, చైనా కమ్యూనిస్టు పార్టీకి విశ్వాసపాత్రంగా ఉండటం ద్వారా నా బాకీ తీర్చుకుంటాను. ఇదే నేను చేయగల్గినది - చేసేది. మా అమ్మకు శాంతికలుగుగాక.

N

# మహిళలపై పెరుగుతున్న హింస

**మహిళలపై పెరుగుతున్న నేరాలు**

| నేరం | 1995 | 2000 | 2005 | 2010 |
|---|---|---|---|---|
| బలాత్కారం | 13,754 | 16,496 | 18,359 | 22,172 |
| వరకట్న హత్యలు | 4,648 | 6,995 | 6,787 | 8,391 |
| అకృత్యాలు | 26,856 | 32,940 | 34,175 | 40,613 |
| లైంగిక వేధింపులు | 4,689 | 11,024 | 9,984 | 9,961 |
| భర్త, బంధువుల హింస | 28,579 | 45,778 | 58,319 | 94,041 |
| బాలికల తరలింపు | - | 64 | 149 | 36 |
| మొత్తం | 78,526 | 1,13,297 | 1,27,773 | 1,75,214 |

*ఆధారం : జాతీయ నేర రికార్డుల బ్యూరో.*

ఐక్యరాజ్యసమితి ప్రకారం మానవ హక్కుల ఉల్లంఘన అతి తరచుగా జరిగేదీ, అతి తక్కువగా న్యాయస్థానాల్లో విచారణ జరిగేది మహిళలపై అకృత్యాలే. ప్రపంచ వ్యాపితంగానే బాధితులు ముందుకు రావడం తక్కువగా వుందనీ; విద్య, ఆస్తి కలిగి వుండటమన్న అంశాలు దీనిలో తోడ్పడటం లేదనీ కూడా పేర్కొంది.

మహిళలపై జరుగుతున్న అకృత్యాలలో 80శాతం పైగా పోలీసు స్టేషనుకో, న్యాయస్థానానికో చేరవు. అయినా రిజిస్టరు అయిన మేరకు కూడా అవి నానాటికీ పెరుగుతున్నాయి. జాతీయ నేర రికార్డుల బ్యూరో నివేదికలు మహిళలపై అకృత్యాలను విశ్లేషించి వార్షిక నివేదికలిస్తున్నది. మహిళలపై అకృత్యాలను బలాత్కారం, వరకట్న హత్యలు, అకృత్యాలు, లైంగిక వేధింపులు, భర్త అతని బంధువులు పెట్టిన హింస, బాలికల తరలింపుగా పేర్కొంటున్నది. అలాగే ప్రతిరాష్ట్రంలోనూ ప్రతి లక్ష జనాభాకూ మహిళలపై నేరాలు ఎన్ని జరిగాయో కూడా పేర్కొంటున్నది.

బ్యూరో సమాచారాన్ని సేకరించి విడుదల చేయడం ప్రారంభించిన నాటి నుండి గత 15ఏళ్లలో మహిళలపై అన్ని రకాల నేరాలూ పెరుగుతూ వస్తున్నాయి. ఎక్కువగా పెరుగుతూ వచ్చింది భర్త అతని బంధువులు చేసిన హింస. 2010లో ఇవి మొత్తం నేరాలలో దాదాపు సగం వున్నాయి.

రాష్ట్రాల వారీగా చూసినప్పుడు ఎక్కువ నేరాలు జరిగిన రాష్ట్రాలుగా ఆంధ్రప్రదేశ్ (27,244 నేరాలు), పశ్చిమబెంగాల్ (26,125 నేరాలు) వున్నాయి. ఇవి దేశం మొత్తం నేరాలలో 17 మరియు 16శాతం. అంటే మొత్తం నేరాలలో మూడవవంతు ఈ రెండు రాష్ట్రాల్లోనే జరిగాయి. అదే ప్రతి లక్ష జనాభాకు జరిగిన నేరాలుగా చూసినప్పుడు ఈ రెండు రాష్ట్రాలు మూడవ (32.38) నాల్గవ (28.96) స్థానాల్లో వున్నాయి. దేశ జనాభాలో ఈ రాష్ట్రాల జనాభా 7శాతంగానే ఉంది. కాగా దేశ జనాభాలో 17శాతంగా వున్న ఉత్తరప్రదేశ్‌లో 9శాతం నేరాలు జరిగినట్లు రిజిస్టరు అయింది. అయినా నేరాల సంఖ్యలో (20,169) మూడవస్థానంలో ఉంది.

ఈ గణాంకాల నుండి ఒక ఖచ్చితమైన నిర్ధారణకు రాలేము. రిజిస్టరు అయిన నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. కాగా రిజిస్టరు కాకుండా పోతున్న నేరాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఊహించు కోవాల్సిందే తప్ప ఈ గణాంకాలు ఏమీ తోడ్పడవు. అవి కూడా ఇంత విస్తృతంగా పెరుగుతున్నాయన్నదే జీవితానుభవం.

N

# "వ్యూహాత్మక ప్రతిష్ఠంభన నుండి వ్యూహాత్మక దాడి స్థితికి పురోగమించేందుకు ప్రజాపునాదిని విస్తరించండి - లోతొనర్చండి!"

## ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ పిలుపు

*(పార్టీ పునస్థాపన 43వ వార్షికోత్సవాన్ని ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టుపార్టీ ఉత్సాహంగా జరుపుకుంది. ఈ కాలంలో జనతా ప్రజాతంత్ర విప్లవంలో సాధించిన విజయాలను నెమరువేసుకుంది. సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణపరంగా, సైనిక పరంగా సాధించిన విజయాలనూ, సాగిన పొరపాటు ఆచరణలనూ, తప్పులనూ సమీక్షించుకుంది. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ విడుదల చేసిన ప్రకటననుండి కొన్ని భాగాలను పునర్ముద్రిస్తున్నాము. - సంపాదకుడు)*

**విప్లవంలో** విజయాలు సాధించేందుకు త్యాగపూరిత కృషి సల్పిన పార్టీ కార్యకర్తలకు, సభ్యులకు, ప్రజలందరికీ రెడ్ సెల్యూట్. విప్లవ వీరుల అమరత్వాన్ని ఆదర్శంగా తీసుకుని ఆచరిద్దాం.

గత ఏడాది కాలంలో సైద్ధాంతిక, రాజకీయ, నిర్మాణ రంగాల పనిలో గణనీయమైన ప్రగతిని సాధించాము. వ్యూహాత్మక దెబ్బకాచుకునే స్థితిని, వ్యూహాత్మక ప్రతిష్ఠంభన స్థితికి పురోమింప చేయటానికి అవసరమైన రాజకీయ అవసరాలను నెలకొల్పడంలో విజయం సాధించాము. ప్రజాయుద్ధాన్ని తీవ్రపరిచేందుకు రాజకీయ పునాదిని పటిష్టం చేయగలిగాము.

ఫలితంగా జాతీయ ప్రజాసైన్యం ఎత్తుగడలరీత్యా ఎదురుదాడిలో గణనీయ విజయాలు పొందింది. ఫాసిస్టు కీలుబొమ్మ ప్రభుత్వ తీవ్ర సైనికదాడి సమయంలో ఇది సాధించగలిగాము.

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ, ఫిలిప్పైన్స్ పాలక వ్యవస్థలోనూ వున్న సంక్షోభ పరిస్థితులు జనతా ప్రజాతంత్ర విప్లవం సాగించేందుకు అత్యంత అనుకూల పరిస్థితులను ఏర్పరిచాయి. ఈ సంక్షోభ పరిస్థితులను సంపూర్ణంగా వినియోగించుకుందాం.

గుత్త పెట్టుబడిదారీ విధానం, నయా ఉదారవాద విధానాలు పూర్తిగా అప్రతిష్ఠ పాలయ్యాయి. ఫిలిప్పైన్స్‌లోనూ, ప్రపంచంలోనూ సామ్రాజ్యవాదానికీ, అభివృద్ధి నిరోధకత్వానికీ వ్యతిరేకంగా ఎదురుదాడికి పూనుకోవాల్సిన సమయమాసన్నమైంది.

గెరిల్లా ప్రాంతాల సంఖ్యను పెంచుకునే మార్గంలో వున్నాము. ఈ ప్రాంతంలోని లక్షలాది ప్రజలు ప్రజా యుద్ధానికి, ప్రజాసైన్యానికీ ప్రత్యక్ష ఆధారపడవలసిన పునాది. కార్మికుల, రైతాంగపు, యువకుల, మహిళలల బాలల, సాంస్కృతిక ప్రజాసంఘాల బలం పెరుగుతున్నది. ప్రజాధికార అంగాలకు ఈ ప్రజాసంఘాలే విస్తృత ప్రజాపునాది.

ఇలాంటి అంగాలే బడాబూర్జువా - భూస్వామ్య అభివృద్ధి నిరోధక ప్రభుత్వానికి విభిన్నంగా కార్మిక కర్షక జనాతా ప్రజాతంత్ర ప్రభుత్వంగా వుంటుంది. విద్య, ఆరోగ్యం, భూ సంస్కరణలు, ఉత్పత్తి నిర్వహణ, రక్షణ, ప్రజల మధ్య సమస్యల పరిష్కారం, సాంస్కృతిక కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

అయితే కొన్ని పాత గెరిల్లా ప్రాంతాలలో నిర్మాణ, రాజకీయ, సైనిక పరంగా తీవ్రనష్టాలు జరిగాయి. ఇవి శతృవుదాడుల తీవ్రతవల్ల కంటే, సైనిక పనిలో నిర్లిప్తత, దీర్ఘకాలంగా ప్రజాసంఘాల పట్లా భూస్వామ్య వ్యతిరేక పోరాటాల పట్లా, ప్రజలల్లోరాజకీయ విద్యా ప్రచారం పట్లా ఉదాసీనత; ఆచరణలోనూ, ఆలోచనల్లోనూ ధనిక రైతుశక్తుల ప్రభావానికి లోనై పార్టీ యూనిట్లు దిగజారటమూ కారణంగా ఈ నష్టాలు వాటిల్లాయి. క్రింది స్థాయిలోనే కాక పార్టీ, సైన్యం పనిలోనూ, ఉన్నత నాయకత్వ స్థాయిలోనూ ఈ తప్పులూ, లోపాలు కనిపించాయి.

జనతా ప్రజాతంత్ర ప్రభుత్వ చట్టాలను ఉల్లంఘించిన పారిశ్రామిక, వాణిజ్య సంస్థలనూ, భూఎస్టేట్లనూ రద్దు చేశాము. ఈ ఉల్లంఘనలు పర్యావరణానికీ, వ్యవసాయ ఉత్పత్తికీ చేటు కలిగించేవిగా ప్రజల భూమిని ఆక్రమించినవిగా, భూ సంస్కరణలను అడ్డగించినవిగా, భవిష్యపారిశ్రామికీకరణకు ఆటంకంగా ఖనిజవనరులను ఎగుమతి చేసేవిగా వున్నాయి.

ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వ మొహించే శక్తిగల పార్టీగా పార్టీని మరింత బలోపేతం చేయటం మన జరూరుకర్తవ్యం. సైద్ధాంతికంగా, రాజకీయంగా, నిర్మాణ పరంగా పార్టీని మరింత పటిష్టం చేయాలి. పార్టీ కమిటీ పద్ధతిని, అన్నిస్థాయిల్లో పార్టీనాయకత్వ పాత్రను పటిష్టం చేయాలి.

పట్టణ, గ్రామీణ ప్రాంతాలు రెండింటిలోనూ ప్రజా ఉద్యమాన్ని విస్తరించాలి; లోతుచేయాలి. పట్టణ ప్రాంతంలోని ప్రజాసంఘాలు జాతీయస్వాతంత్రం, ప్రజాస్వామ్యాల రక్షణకు పోరాడటాన్ని ప్రోత్సహించాలి. గెరిల్లా ప్రాంతాలలో ప్రజలమధ్య మన పని ప్రజా ఉద్యమంగా అభివృద్ధి చేయాలి.

ఫ్యూడలు, అర్ధ ఫ్యూడలు దోపిడీకి వ్యతిరేకంగా, ప్రభుత్వ పోలీసులూ, సైన్యం సాగించే అణచివేత చర్యలకు వ్యతిరేకంగా విస్తృత పోరాటాలు సాగించేవిధంగా రైతాంగానికి మనం నాయకత్వమందించాలి. భూసంస్కరణల అమలు, బంజరు భూముల స్వాధీనం, ఉత్పత్తి పెంపుదల, ప్రజల జీవనవృత్తికొరకు రైతాంగాన్ని విస్తారంగా పోరాటాలలోకి సమీకరించాలి.

సరైన వర్గ పంథాలో ఐక్యసంఘటనా విధానాన్ని అమలు పరచాలి. కార్మిక - కర్షక ఐక్యత పునాదిగా పెటీ బూర్జువాశ్రేణులతో ఐక్యత సాధించాలి. మధ్యతరహా బూర్జువాల్లోని దేశభక్తి శక్తులతో ఐక్యతసాధించాలి. అభివృద్ధి నిరోధకవర్గాలలోని కొన్ని సెక్షన్లలో తాత్కాలిక కూటమి సాధించవచ్చు. ప్రజలకు చేరి, వారిని చైతన్యపరిచి నిర్మాణయుతం చేసి, పోరాటాలలోని సమీకరించి ప్రజాయుద్ధాన్ని పురోగమింపచేసే లక్ష్యంతో ఐక్యసంఘటన విధానం అమలు చేయాలి.

అమెరికా సామ్రాజ్యవాదానికీ, దాని తొత్తులకు వ్యతిరేకంగా దేశభక్తియుత, ప్రజాస్వామిక శక్తులన్నింటినీ ఐక్యం చేయాలి. **N**

# పత్రికా స్వేచ్ఛ దోపిడీ వ్యవస్థలో ఎండమావి

**తెలుగులో** అతిపెద్ద పత్రికైన 'ఈనాడు' అధిపతి రామోజీరావుకు చెందిన టెలివిజన్ ఛానళ్ల వ్యాపారాన్ని దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముఖేష్ అంబానీ వివిధ ద్రవ్య పద్ధతుల్లో కొనివేశాడు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ఇండిపెండెంట్ మీడియా ట్రస్టు అన్న సంస్థవుంది. అది టివి 18 అన్న వార్తా ఛానల్‌ను నడుపుతున్న నెట్‌వర్క్ 18 అన్న కంపెనీలో షేర్లను కొనుగోలు చేసింది. రిలయన్సుకు చెందిన కంపెనీలూ కలిసి ఈ టివి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ వార్తా ఛానళ్లనూ, ఈ టీవీ ఉర్దూ ఛానెల్‌నూ, మరాఠీ, కన్నడ, బెంగాలి, గుజరాతీ, ఒరియా భాషల్లోని వినోద ఛానళ్లను పూర్తిగా కొనివేశాయి. ఈ టివి తెలుగు, ఈ టివి తెలుగువార్తా ఛానళ్లలో 49 శాతం వాటానూ కొన్నాయి. దీని విలువ 4 వేల కోట్ల వరకూ వుంటుందనీ, దీనిలో రిలయన్స్ కంపెనీలది 2600 కోట్లనీ అంచనా. కొనుగోలు చేసిన ఈ టివితోసహా టివి 18 గ్రూపుపైన నిర్వహణాధికారాలన్నీ నెట్‌వర్క్ 18కి వుంటాయి.

ఇది కాక రిలయన్స్ కంపెనీ 2010 జులైలో టివి ఛానళ్ల ప్రసార పంపిణీ కంపెనీ డిజి కేబుల్‌ను షేర్లను తీసుకుంది. జనవరిలో సినిమా ప్రదర్శన శాలల వ్యాపారం నిర్వహించే ఫేమ్ ఇండియాలో 32 శాతం వాటాలు కొనుగోలు చేసింది. అదేనెలలో టివి ఛానల్ ఇమాజిన్‌ను పూర్తిగా కొని వేసింది. నెట్ వర్క్ 18 ఆధ్వర్యంలో సి.ఎన్.బి.సి.-టివి 18, సిఎన్‌బిసి ఆవాజ్, సిఎన్‌బిసి-ఐబిఎన్, ఐబిఎన్ 7, ఐబిఎన్‌లోక్‌మత్ అన్న వార్తా ఛానళ్లు, కలర్స్ ఎంటివి, విహెచ్1, నిక్ అన్న వినోద ఛానెళ్లు వున్నాయి. నెట్‌వర్క్ 18కు నష్టాలూ, చెల్లించాల్సిన వడ్డీలు కలిపి 128 కోట్లు లోటువుంది. దీనిలో రిలయన్స్ పెట్టిన 2100 కోట్లు పెట్టుబడి దాని ఆర్థిక పరిస్థితిని బాగా మెరుగుపరుస్తుంది.

ఈ కొనుగోళ్లతో దేశంలో అతిపెద్ద మీడియా సంస్థగా రిలయన్స్ ఆవిర్భవిస్తుంది. జైన్ కుటుంబం ఆధీనంలో వున్న టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూపునూ, రాబర్డు మర్డొక్ ఆధీనంలోని స్టార్ గ్రూపును వెనక్కు నెట్టివేసింది.

ఇప్పుడీ వ్యవహారమంతా సెబి ముందువుంది. సెబి అనుమతిస్తేనే ఇది అమలవుతుంది. ఈనాడు గ్రూపుకు చెందిన మార్గదర్శి ఛిట్‌ఫండ్‌పై కాంగ్రెస్‌నాయకులు ఆరోపణలు చేయటంతో రిజర్వు బ్యాంకు ముందుకొచ్చి తీసుకున్న చర్యలవల్ల రామోజీరావుకు నిధులు అవసరమైనాయి. అవి సమకూర్చడానికి ముందుకొచ్చిన ప్రైవేటు ఈక్విటీ కంపెనీ బ్లాక్‌స్టోన్‌ను వై.ఎస్.ఆర్. బెదిరించి వెనక్కుపంపాడన్న వదంతులున్నాయి. అది వెనక్కి తగ్గటంతో నిమేష్‌కంపానీకి చెందిన జె.ఎం. ఫైనాన్సియల్ సర్వీసెస్ రూ. 2600 కోట్లు సమకూర్చింది. వై.ఎస్.ఆర్. కంపానీని వేధింపులకు గురిచేసాడన్న వదంతులున్నాయి. ఈ 2600 కోట్లు రిలయన్సువేననీ, ఇప్పుడు వీటినే రిలయన్స్ (తిరిగి) కొంటున్నట్లు చెబుతున్నదనీ, ఇది పద్ధతి తప్పటమేనన్న ఆరోపణలూ వున్నాయి. ఈ ఆరోపణలూ, వందంతుల చుట్టూ అనేక రాజకీయ ఆరోపణలూ రాజ్యమేలుతున్నాయి.

సంకుచిత రాజకీయ ఆరోపణలను ప్రక్కనబెడితే, బడా బూర్జువా వర్గానికి చెందిన కంపెనీ మీడియాపై గుత్తాధిపత్యం పొందటాన్ని గురించీ, దాని ప్రభావం గురించీ పెద్దగా చర్చ జరగటంలేదు. బడా బూర్జువాలు మీడియా అధిపతులుగా వుండటం కొత్తేమీకాదు. ఒకప్పుడు బిర్లాల ఆధిపత్యంలో హిందూస్తాన్ టైమ్స్ పత్రిక, సెర్చ్‌లైట్ పత్రిక ఉండేవి. టైమ్స్ ఆఫ్ ఇండియా, ఇకానామిక్ టైమ్స్ పత్రికలు నడిపే బెన్నెట్ కోల్‌మాన్ కంపెనీపై దాల్మియా, జైన్‌ల ఆధిపత్యం ఉండేది (ఆతర్వాత దాల్మియా తప్పుకున్నాడు) టాటాకు స్టేట్స్‌మన్ పత్రిక వుండేది. వీరంత పెద్దవాడు కాకపోయినా రామ్‌నాథ్ గొయంకాకు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వుండేది. అప్పట్లో ఈ నలుగురికీ జూట్ మిల్లులుండేవి. దానితో వీటిని జూట్ పత్రికలనేవారు. అవహేళనగా నొక్కి పలికి ఝూట్ (అబద్ధం) పత్రికలనేవారు. ఆనాడు దేశీయ భాషాపత్రికల్లోనే జాతీయోద్యమంలో పాల్గొన్న వారు నడిపిన రీత్యా కొంత స్వతంత్రత కన్పించేది.

కాలక్రమేణా, పత్రికలను నిర్వహించే కంపెనీలే పెద్ద కంపెనీలుగా మారాయి. ఉదా: హిందూ పత్రిక నడిపే కస్తూరి అండ్ కంపెనీ. టివి ప్రసారాలు ప్రారంభం కావటంతో టివి వార్తా ఛానళ్లు తామరతంపరగా పుట్టుకొచ్చాయి. వీటిలో ఒకటి రెండూ మాత్రమే లాభదాయకంగా నడుస్తున్నాయి. దీనితో ఈ రంగంలోకి బడా కంపెనీల నుండి పెట్టుబడులు రావటం మొదలైంది. 2010-11 ఆర్థిక సంవత్సరంలో ఇలా వచ్చిన పెట్టుబడులను పట్టికలో చూడండి. ఈ 27 అమ్మకాల మొత్తం విలువ 70 కోట్ల డాలర్లని అంచనా. దీని ఫలితంగా వార్తలెలా "స్వీయ సెన్సార్"కు గురౌతాయో చూడండి. హొండాకార్ల ఫ్యాక్టరీలో కార్మికున్ని జపాన్

(తరువాయి 5వ పేజీలో)

### 2010-11 ప్రసార మాధ్యమాల ఒప్పందాలు

| మాసం | మదుపుకంపెనీ | మదుపుదారు కంపెనీ | వాటా% | విలువ(మిలి.డా) | రంగం |
|---|---|---|---|---|---|
| **ఎ.అక్విజిషన్ & మెర్జర్ ద్వారా** | | | | | |
| 1. సెప్టెబరు | సన్ డైరెక్ట్ టివి | ఆస్ట్రాల్ ఆసియా | 15 | 88 | టివి పంపిణీ |
| 2. జులై | డిజి కేబుల్ | రిలయన్స్‌కమ్యూనికేషన్స్ | వాటాల మార్పిడి | | టివి పంపిణీ |
| 3. మార్చి | ఎక్స్‌ప్రెస్ పబికేషన్స్ (మధురై) | జూపిటర్ మీడియా | 26 | 53 | పత్రిక |
| 4. సెప్టెంబర్ | ఎన్‌డి టివి | ఆస్ట్రాల్ ఆసియా | 49 | 40 | టివి ప్రసారాలు |
| 5. మే | మిడ్ డే మల్టిమీడియా | జాగరణ్ ప్రకాశన్ | 100 | 40 | పత్రిక |
| 6. జులై | టర్మరిక్ విజన్ | ఆస్ట్రాల్ ఆసియా | 80 | 26 | టివి ప్రసారాలు |
| 7. ఆగస్టు | గెట్‌యిట్ ఇన్ఫొసర్వీసెస్ | ” | 50 | 22 | పత్రికలు/ఆన్‌లైన్ |
| 8. జూన్ | మాయా ఎన్‌టర్‌టైన్‌మెంట్ | ఆప్‌టెక్ | 100 | 16 | యానిమేషన్ |
| 9. జనవరి | ఫేమ్ ఇండియా | ఐనాక్స్ | 7 | 17 | సినిమాప్రదర్శన |
| 10. జనవరి | ఫేమ్ ఇండియా | రిలయన్స్‌మీడియావర్క్స్ | 32 | - | ” |
| 11. జనవరి | ఇమాజిన్‌షోబిజ్ | రిలయన్స్ బ్రాడ్‌కాస్ట్ | 100 | - | టివి |
| **బి. ప్రైవేటు ఈక్విటీ ద్వారా** | | | | | |
| 1. ఏప్రిల్ | జాగరణిమీడియానెట్‌వర్క్ | బ్లాక్‌స్టోన్ | 13 | 49 | పత్రిక |
| 2. సెప్టెంబరు | ఆసియా నెట్ | సిడొఫి | 9 | 36 | కేబుల్ టివి |
| 3. మే | ఐఎన్‌ఎక్స్‌మీడియా | న్యూసిల్క్‌రూట్ | 50 | 20 | టివి |
| 4. ఫిబ్రవరి | వాల్యుబుల్ మీడియా | డిఏఆర్ కాపిటల్ | 26 | 21 | సినిమా |
| 5. ఏప్రిల్ | అసోసియేటెడ్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ | ఎస్ఏఐఎఫ్ | 14 | 12 | టివి |

# దేశంలోని వివిధ ప్రాంతాలలో ఆందోళనలు

## గోవా: అక్రమ ఖనిజ తవ్వకాలను నిరోధించాలని ప్రజల ఆందోళన

నవంబర్ 22న ఖనిజ ఎగుమతులపై ఆధారపడిన వేలాదిమంది ప్రజలు గోవా రాజధాని పనాజీలో ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. చట్టబద్ధమైన ఖనిజ తవ్వకాలకు, ఖనిజ వ్యాపారాలకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. వీరిపై పోలీసులు చేసిన లాఠీఛార్జీలో 100మంది ఆందోళనకారులు గాయపడ్డారు. ఆందదోళనకు ప్రధానంగా నాయకత్వం వహిస్తున్న ఒక నాయకుడిని పోలీసులు దాదాపు కిలోమీటరు దూరం రోడ్డుపై లాక్కువెళ్ళారు–చావబాదారు. పోలీసులపై ఇతను తిరగబడ్డాడని, రాళ్ళువిసిరాడని ఎప్పటిలానే పోలీసులు ఒక కట్టుకథను ప్రచారంలో పెట్టారు.

## రాజస్థాన్: రీటైల్ రంగంలో ఎఫ్.డి.ఐల చొరబాటుకు చిన్న వ్యాపారుల నిరసన

రిటైల్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను దేశీయ చిన్న వ్యాపార వర్గాలు వ్యతిరేకిస్తుండగా, ఫ్రెంచ్ బహుళజాతి పరిశ్రమ క్యారీఫోర్ చిల్లర వర్తక దుకాణాలను జైపూర్‌లో తెరిచింది. దీనిని నిరసించిన ఆందోళనకారులు ప్రభుత్వానికి ఫ్రెంచిరీటైల్ కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేయటంతోపాటు, ఆ కంపెనీ ద్వారాలను. షాపుల హోర్డింగులను ధ్వంసం చేశారు. పోలీసులు జోక్యంచేసుకొని నిరసనకారులను చెదరగొట్టారు. రాజస్థాన్ ట్రేడ్ అసోసియేషన్ ఈ నిరసనలను నిర్వహించింది.

## పంజాబ్: ప్రభుత్వ భూసేకరణకు రైతుల వ్యతిరేకత

అమృతసర్‌కు 45 కి॥మీ॥ దూరంలోనున్న బియాస్ గ్రామానికి చెందిన రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ విధానాన్ని నిరసిస్తూ 6-12-11న జాతీయ రహదారిని దిగ్బంధించారు.

## అసోం: భారీ డ్యాము నిర్మాణానికి నిరసిస్తూ మునక ప్రాంత ప్రజల ఆందోళన

నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ అరుణాచలప్రదేశ్‌లోని గేరుకముఖ్ వద్ద 2000 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అనువైన భారీ డ్యాము నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మునక ప్రాంతాల ప్రయోజనాలకు ఇది తీవ్ర భంగకరమని, కనుక ఈ డ్యాము నిర్మాణాన్ని ఆపివేయాలని 2011 డిసెంబర్ 2 నుండి అసోం ప్రజలు ఒక నిరసనాందోళనను కొనసాగించారు. డ్యాము నిర్మాణ ప్రాంతానికి యంత్రసామాగ్రిని, సాధనాలను తీసుకువెళ్ళే ట్రక్కులను నిలిపివేస్తూ వచ్చారు. జాతీయ రహదారి–52 స్త్రీ,పురుషులు పలు ప్రాంతాలలో బైఠాయించి డ్యామ్ ప్రాంతానికి కావలసిన యంత్రసామాగ్రిని చేరనీయకుండా అడ్డుకున్నారు. 2-1-12న దాదాపు 20కిపైగా సంఘాల ఆధ్వర్యంలో డ్యాము నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ స్త్రీ, పురుషులు జాతీయ రహదారి–52పై నిరవధికంగా బైఠాయించారు.

## జమ్ముకాశ్మీర్: విద్యుత్ కోతలను నిరసించిన ప్రజలపై పోలీసులు కాల్పులు

జమ్మూకాశ్మీర్ రాష్ట్రం–బోనియర్‌వద్ద యూరిపవర్‌ప్లాంట్ ఎదుట 2-1-12న 500 మంది ఈ ప్రాంతంలో పదేపదే చోటు చేసుకుంటున్న విద్యుత్ కోతలను వ్యతిరేకించారు. నిరంతరాయవిద్యుత్ సరఫరాను ప్రజలు కోరుతూ ప్రదర్శన జరుపుతుండగా సిఐయస్ఎఫ్ పోలీసులు జరిపిన కాల్పులలో ఒకరు చనిపోగా ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కాల్పులు ఘటన ఈ ప్రాంతంలో ఉద్రిక్తతకు దారితీయగా, ప్రజలు విద్యుత్ ప్లాంట్ బయట సమీకృతులై నిరసనకారులుపై కాల్పులు సాగించి, ఒకరు మృతిచెందటానికి కారుకులైన పోలీసు అధికారులును శిక్షించాలని డిమాండ్ చేశారు.

## తమిళనాడు: తొలగించిన కార్మికులను తిరిగి తీసుకోవాలని హ్యుండాయ్ కార్మికుల ఆందోళన

నవంబర్ 29న చెన్నైలోని హ్యూండాయ్ మోటార్ ఇండియా కార్మికులు జపాన్ తరహాలో నిరసన కార్యక్రమాలు చేపట్టి 2010 డిసెంబరు ఒప్పందాన్ని తిరిగి అమలు చేయాలని 32 మంది తొలగించిన ఉద్యోగులను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నవంబర్ 30న 18 మంది కార్మికులను ఒప్పందం ప్రకారం తిరిగి విధులలోకి తీసుకోగా మిగిలిన కార్మికులనుకూడా తిరిగి తీసుకోవాలని నిరసన తెలియజేసే ప్రయత్నంలో పోలీసులు కార్మికులను అరెస్టుచేసి నిరోధించారు.

## ఒడిషా: యాజమాన్య మొండి వైఖరిని నిరసిస్తూ కార్మికుల ఆందోళన

ఒడిషాలోని ఆరిండ్ రిఫ్రాక్టరీ ప్లాంట్‌లోని 224 మంది కార్మికులు 23వ జాతీయ రహదారిని దిగ్బంధించారు. వీరంతా అరెస్టు చేయబడి సుందర్‌ఘర్ జైలుకు తరలించబడ్డారు. అక్టోబర్ 16వ తేదీన వారు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. స్పృహలేకుండా పడిపోయిన ముగ్గురు కార్మికులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## పశ్చిమబెంగాల్: వేతనాల పెంపుకై టీ తోటల కార్మికుల సమ్మె

ఉత్తర బెంగాల్‌లోని దూరాస్, తెరాయి ప్రాంతంలోని టీతోటలలో 2011 ఆగస్టు 2వ వారంలో 3 రోజుల సమ్మె జరిపారు. వారు రోజువారీ వేతనాలను 67/- రూ నుండి 130/-రుకు పెంచాలని డిమాండ్ చేశారు. కానీ ప్లాంటేషన్ అసోసియేషన్ కన్సల్టివ్ కమిటీ గానీ, ఎపెక్స్ బాడీగానీ టీ తోటల కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు అంగీకారంగా లేవు.

## ఆంధ్రప్రదేశ్:

### శాశ్వత వైస్ ఛాన్సలర్ నియామకానికై విద్యార్థుల, అధ్యాపకుల ఆందోళన

ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజస్ యూనివర్శిటీ అధ్యాపకులు, విద్యార్థులు 8-8-11 నుండి 3 రోజులపాటు నిరసనాందోళన జరిపి తమకు తక్షణం నూతన శాశ్వత వైస్‌ఛాన్సలర్‌ను నియమించవలసిందిగా డిమాండ్ చేశారు.

### అమ్మోనియా ప్లాంట్ విస్తరణ కేంద్రానికి వ్యతిరేకత

తూర్పుగోదావరి జిల్లా–ఇంద్రపాలెం వలసపాకాల గ్రామాల అధ్యక్షులు –ఎన్.ఎఫ్.సి.ఐ.ఎల్. ద్వారా అమ్మోనియా మరియు యూరియా ఉత్పత్తి కేంద్రాన్ని విస్తరించటాన్ని వ్యతిరేకిస్తున్నారు. 18-8-11న జిల్లాకలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ఎదుట వీరు నిరసన తెలిపారు. పర్యావరణ దుష్ప్రభావాల గురించి, వారు ఇప్పటికే ఎదుర్కొంటున్న నీటి కాలుష్యం గురించి వివరించారు. ఈ ప్రాంతంలో ఎన్.ఎఫ్.సి.ఐ.ఎల్. పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థాలు, తద్వారా నీటి కాలుష్యం ఫలితంగా, ఈ నీటితో వండిన ఆహారం పసుపుపచ్చ రంగులోకి మారిపోవటాన్ని, సంభవించే చర్మవ్యాధులను, చూపు మందగించటాన్ని వీరు ప్రధానంగా పేర్కొంటున్నారు. అమ్మోనియా ప్రమాదకరమైన రసాయనం కావటం వలన భోపాలువంటి పెనువిపత్తు ఇక్కడ సంభవించే ప్రమాదముందని వీరు హెచ్చరించారు.

### జెఆర్ఆర్ ల్యాబ్ మందుల పరిశ్రమ కాలుష్యాన్ని నిరసిస్తూ ఆందోళన

ఆగస్టు 30వ తేదీన శ్రీకాకుళం జిల్లా రిషిని గ్రామస్తులు ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా వ్యతిరేకతను వ్యక్తం చేశారు. తమ విస్తరణలో బాగంగా జె.ఆర్.ఆర్.ల్యాబ్ మందుల పరిశ్రమ చేపట్టిన చర్యలను వీరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జాయింట్ కలెక్టరును, కాలుష్యనియంత్రణ మండలి అధికారులను చుట్టుముట్టి వారి వ్యతిరేకతను నమోదు చేయవలసిందిగా డిమాండ్ చేశారు.

### పత్తి సేకరణ ధర తగ్గింపుకు రైతుల నిరసన

నవంబర్ 2న వందలాదిమంది పత్తిరైతులు వరంగల్‌జిల్లా ఎనుమల వ్యవసాయ మార్కెట్‌లోకి తీవ్ర ఆగ్రహంతో ప్రవేశించి తూకపుయంత్రాలను ధ్వంసం చేశారు. పత్తిసేకరణ ధరపడిపోవటాన్ని వీరు నిరసించారు. మార్కెట్‌లో లావాదేవీలను జరపకుండా వీరు అడ్డుకున్నారు.

### థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణానికి ప్రజల వ్యతిరేకత

డిసెంబర్ 8వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా బర్రెంపాలెంకు చెందిన గ్రామస్థులు ప్రజాభిప్రాయసేకరణను వ్యతిరేకించారు. ప్రైవేటు యాజమాన్యంలో నిర్మించనున్న విద్యుత్ పరిశ్రమను వీరు నిరసిస్తున్నారు. ఈ విద్యుత్ ప్లాంట్ ఫలితంగా నష్టపోనున్న 10 గ్రామాలకు చెందిన ప్రజలు ప్రజాభిప్రాయసేకరణ జరిగే ప్రాంతానికిదోవతీసే రహదారులపై బైఠాయించి దిగ్బంధించారు. ఆయిల్‌పామ్ తోటల పైనా, ప్రజల ఆరోగ్యాలపైనా విద్యుత్ ప్లాంట్ వెలువరించే కాలుష్యం కలిగించే దుష్ప్రభావాలపట్ల వీరు ఆందోళన చెందుతూ ఈ విద్యుత్ ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు.

### ఓపెన్ కాస్టు గనుల తవ్వకాలకు నిరసనగా ప్రజల ఆందోళన

డిసెంబర్ 14న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు చెందిన జవార్‌ఖని ఓపెన్‌కాస్ట్ తవ్వకాల విస్తరణ ప్రతిపాదనల మేరకు ఇల్లెందులో భూమిపూజ నిర్వహించిన అనంతరం ప్రజల ఆందోళనలతో పనులు నిలిపివేయబడ్డాయి. తవ్వకాల విస్తరణకు వ్యతిరేకంగా వారు నినదించారు. ప్రశాంతంగా జీవిస్తున్న పెద్దసంఖ్యలోని ఈపట్టణ వాసులను నిర్వాసితులుగా చేయటమే గాక భూఉపరితలంపై పర్యావరణ వ్యవస్థను దెబ్బతీస్తుందని వారు పేర్కొన్నారు.

### తమ గుడిసెల కూల్చివేతకు నిరసనగా గుత్తికోయిల ఆందోళన

ఖమ్మంజిల్లా సుబ్బంపేట గ్రామ పంచాయితీ పరిధిలోని గుత్తికోయిలతోసహా తాత్కాలిక ఆవాసాన్నేర్పరచుకున్న ఆదివాసులందరూ డిసెంబర్ 26వ తేదీన పోలీస్ యంత్రాంగంతో కలసి ఫారెస్ట్ అధికారులు తమ గ్రామాన్ని బుల్‌డోజర్లతో కూల్చి వేయటాన్ని, 14 గుడిశెల కూల్చివేతను తీవ్రంగా ప్రతిఘటించారు. ఇందులో మహిళలు ముందు భాగాన నిలిచారు. ఫారెస్ట్ అధికారులు చట్టవిరుద్ధ నిర్మాణాలుగా పేర్కొంటూ ఆ గుడిశలను కూల్చివేశారు.

### థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్వాసితులకు నష్టపరిహారానికై డిమాండ్

నెల్లూరు జిల్లాకు చెందిన నేలటూరు, పాయకాపురం పరిసర గ్రామాల ప్రజానీకం డిసెంబర్ 16వ తేదీన ధర్నా నిర్వహించి, ఏపిజెన్‌కో ఆధ్వర్యంలో నేలటూరు గ్రామంలో నిర్మించనున్న 4000 మె.వా. సామర్థ్యపు థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణ పనులను నిలిపువేయించారు. ఈ థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణంకోసం తమ నుండి సేకరించిన భూములకు న్యాయమైన నష్టపరిహారాన్ని అందించటంతోపాటు, కార్మికులకు పని భద్రత, గ్రామంలో ఒక ఆసుపత్రి, ఐటిఐ తదితర వనరులను కల్పించాలని డిమాండ్ చేశారు.

### ముడి ఇనుప ఖనిజ తవ్వకాలకు ప్రజల నిరసన–పోలీసుల లాఠీఛార్జి

ప్రకాశంజిల్లా టంగుటూరు మండలం మసలపాడు, కొణిజేడు, సర్వారెడ్డిపాలెం, యర్రంజెర్ల, కందులూరు గ్రామాలనుండి డిసెంబరు 17న మహిళలు, పిల్లలుతో సహా బయలుదేరి ఒంగోలు చేరుకొని, 500 కోట్లరూపాయలవ్యయంతో నిర్మించనున్న ముడి ఇనుపఖనిజ తవ్వకాల పరిశ్రమకు వ్యతిరేకంగా నినదించి ప్రజా అభిప్రాయ సేకరణలను నిలిపివేశారు. ఇనుపఖనిజ తవ్వకాల పేరిట తమ భూములను వదులుకోబోమంటూ బైఠాయించిన ప్రజలపై పోలీసులు పెద్దఎత్తున లాఠీఛార్జీ చేశారు.

N

## పత్రికాస్వేచ్ఛ...

(4వ పేజీ తరువాయి)

సూపర్ వైజర్ కాలితో తన్నిన ఘటనతో ప్రజ్వరిల్లిన సమ్మెను విస్తృతంగా రిపోర్టు చేసిన మీడియా, ఇలా చేస్తే విదేశీ పెట్టుబడులు రావన్న బడా బూర్జువాల ఆదేశంతో అదేపరిస్థితుల్లో బెంగుళూరులోని టయోటా ఫ్యాక్టరీలో జరిగిన సమ్మెను అసలు రిపోర్టే చెయ్యలేదు. అలాగే మారుతీ – సుజికీ కార్ల కంపెనీలో జరిగిన సమ్మెను కార్మిక నాయకుడు డబ్బుపుచ్చుకుని మానివేసాడని ప్రచారం చేశాయి. కాగా నువ్వొక్కడివి ఉద్యోగం వదలుకుంటే కార్మికులందరినీ పనిలోపెట్టుకుని, చట్టబద్ధంగా నీకురావలిసి చెల్లింపులన్నీ యిస్తామన్న యాజమాన్యం బెదిరింపును ఆయన అంగీకరించటమే జరిగింది. వార్తలు వర్గ రంగునెలా పులుముకుంటాయో యానం ఘటనలు తేటతెల్లం చేశాయి. పోలీసుల చిత్రహింసల ఫలితంగా జరిగిన కార్మిక నాయకుడి మరణం హార్టు ఎటాక్ మరణంగా చిత్రితమవగా, దీనితోనూ, పోలీసు కాల్పులతోనూ ఆగ్రహంతో కార్మికులు కొట్టిన కంపెనీ వైస్ ప్రెసిడెంటు మరణం కార్మికులు చేసిన హత్యగా నిర్ధారించారు. మీడియా తన ప్రత్యక్ష, పరోక్ష యజమానులైన బడా బూర్జువాల కనుసన్నలలో ఎలా నడుస్తుందో ఇది తెలుపుతుంది.

ఈ కారణాల రీత్యా చూసినప్పుడు రిలయన్సు మీడియారంగంలో ప్రవేశించి పెద్దమీడియా కంపెనీగా అవతరించటం ఆశ్చర్యకర పరిణామేమీకాదు. అయితే రిలయన్సు కంపెనీ వ్యాపార ప్రయోజనాలలో ఈ అమ్మకం ప్రత్యక్షంగా ముడిపెట్టి వుండటమే రాగల పరిణామాలపట్ల ఆందోళన కలిగించేదిగా వుంది. రిలయన్సుకు చెందిన ఇన్‌ఫొటెల్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీసెస్ అన్న కంపెనీ సెల్‌ఫోన్లలో నాల్గవతరం (జి4) సర్వీసులకు దేశవ్యాపిత నెట్‌వర్క్‌ను నిర్మిస్తున్నది. దీనికి కావలసిన వినోద, వార్తా, క్రీడా, సంగీత, విద్యా తదితర కార్యక్రమాలన్నింటినీ తనకు చెందిన మీడియాకంపెనీలు ఇన్ఫొటెల్‌కి ఇస్తాయి. ఆ మేరకు ఇన్ఫోటెల్ నెట్‌వర్క్ 18తో ఒప్పందం చేసుకుంది. దీనివల్ల జి4 ఫోనుల రంగంలో తానే ముందుంటాననీ (అంటే గుత్తాధిపతినవుతానని) రిలయన్స్ గర్వంగా ప్రకటించుకుంది.

రిలయన్స్ – ఈనాడుల కలయిక మరిన్ని కొనివేతలకు దారితీయటం తప్పనిసరి. జీ టివి, సోనీ వంటివి ప్రాంతీయ భాషల ఛానెల్సుతో ఒప్పందాలు చేసుకుంటాయి. ఈ విధంగా మీడియా గుత్తాధిపత్యాలు ఏర్పడటంతో వార్తలు అమ్మకపు సరుకుగా మారతాయి. గుత్తాధిపతులు తమ ఆర్థిక ప్రయోజనాలకొరకు రాజకీయాలనూ, ప్రజాభిప్రాయాన్ని మలిచేందుకు పూనుకుంటారు. ప్రజాస్వామ్యంలో పత్రికాస్వేచ్ఛ పేరిట కొన్ని చర్యలు తీసుకున్నా, గుత్తాధిపతులు మీడియాను దోపిడీ వర్గాల ప్రచారసాధనంగానే ఉంచుకుంటున్నారు. మీడియాపై యాజమాన్యం కలిగి వుండటంపై పాశ్చాత్య దేశాల్లో వున్న కొన్ని ఆంక్షలు కూడా భారత్‌లో లేవు.

కాగా ప్రస్తుతం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, గుత్తాధిపత్యం నెలకొల్పటానికి సాధనంగా వున్నాయి. స్థానిక వార్తలకు ప్రాధాన్యతనిస్తూ సినిమాల ప్రదర్శనతో సాగుతున్న స్థానిక కేబుల్ ఆపరేటర్లను క్రమద్ధీకరణ పేరిట డిజిటల్ ప్రసారాలలోకి మారమని ఆదేశించింది. ప్రస్తుతం దేశంలో 60 వేల మంది కేబులు ఆపరేటర్లున్నారన్నది అంచనా. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ (రెగ్యులేషన్) అమెండ్‌మెంటు యాక్ట్ 2011, టెలికమ్యూనికేషన్ (బ్రాడ్‌కాస్టింగ్, కేబుల్) సర్వీసెస్ నాల్గవ టారీఫ్ ఆర్డర్ ద్వారా వీరందరి స్వతంత్రతను హరించివేసింది. ప్రేక్షకులను సరిగ్గా లెక్కవేయటం, ఆవిధంగా తగిన రెవిన్యూ ఆదాయం పెంచుకోవటం అన్నవాదనతో తీసుకున్న చర్యలు, కేబులు టీవి ప్రసారదారులు, నిర్వహణదారులు తమ స్వతంత్ర ఉనికిని వదులుకుని టివి ఛానెళ్లకు అమ్మకందారులుగా మార్చేవిధంగా చేస్తుంది. ఆవిధంగా స్టార్ టివి ఆధీనంలోకి హత్‌వే కేబుల్, జిటివి ఆధీనంలోకి డిష్ టివి, సన్‌గ్రూపు ఆధీనంలోకి సుమంగళీ కేబులు వచ్చాయి. ఈ క్రమంలో సామాన్యులు టీవి ప్రసారాలకు చెల్లించే రుసుము పెరిగిపోతుంది.

ప్రస్తుతానికి ఈరంగంలోకి విదేశీ పెట్టుబడులను కొద్దిగానే అనుమతిస్తున్నారు. దానివల్లనే రూపర్డు మర్డొక్‌స్టార్ టివి, డిస్నీ, వయాకామ్ వంటి విదేశీ కంపెనీలు టివి వినోద ఛానెళ్లలో ప్రవేశించాయి. ఈ రంగంలోని అన్ని విభాగాలు నిట్టనిలువునా అడ్డంగా కలిసిపోతూ గుత్తాధిపత్యాలు ఏర్పడుతున్న క్రమంలో విదేశీ పెట్టుబడుల ప్రవేశం కూడా మొదలవుతుంది. వార్తా రంగంలోకి విదేశీ పెట్టుబడుల అనుమతివల్ల లాభనష్టాల చర్చ జరుగుతున్నా, అది ఏమేరకు అనుమతించాలన్న అంశం చుట్టూనే జరుగుతున్నాయి. పెట్టుబడి ఎంత తక్కువస్థాయిలోవున్నా తమ అదుపులోనే కంపెనీని వుంచుకోగల పద్ధతులు విదేశీ పెట్టుబడిదారులకు తెలుసు. అవి తెలిసికూడా నిరోధించకుండా కళ్లుమూసుకు కూర్చోటం కూడా భారత పాలకులు చేయగలరని ఇన్సూరెన్సురంగపు అనుభవం తెలుపుతూనే వుంది. భారత ఉపఖండంలో అనేక జాతుల సజీవ సాంస్కృతిక విభిన్నతను చెరిపివేసి, ఏకైకమార్కెటు సంస్కృతిని నెలకొల్పే ప్రక్రియ మరింత త్వరితమౌతుంది. ఆ సాంస్కృతిక విధ్వంసాన్ని నివారించేందుకు దేశభక్తియుత ప్రజాస్వామిక శక్తులు పూనుకోవాలి.

N

# 23 రోజుల సమ్మె ద్వారా తమ డిమాండ్లను పరిష్కరించుకున్న రైస్‌మిల్ కార్మికులు

**మచిలీపట్నంలోని** 45 ట్రేడింగ్ మిల్లుల్లో సుమారు 1200 మంది ముఠా, బాల బందు కార్మికులు రోజుకు 15 గంటలు, కూలీలు, డ్రైవర్లు 12-24 గంటలు పనిచేస్తూ దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు. దుమ్ము, ధూళిలలో నిరంతరం పనిచేస్తూ శ్వాసకోశ వ్యాధులు, కీళ్ళ నొప్పులు వంటి తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. బస్తాలు మోస్తూ పైనుండి క్రింద పడినా, యంత్ర కోరల్లో చేతులు నలిగినా, ప్రమాదవశాత్తు జరిగే అనర్థాల్లో కార్మికులు చితికిపోవడమే తప్ప ఆదుకునే స్థితిలేదు. 35-25-10 సంవత్సరాలుగా నిలకడగా పనిచేస్తున్నా ప్రమాదబీమా ఎవ్వరికీ లేదు. ఇఎస్ఐ, పిఎఫ్ వంటి చట్టపరంగా లభించాల్సిన సౌకర్యాలు నేటికీ లేవు. భోజనాలు చేసేందుకు ప్రత్యేకంగా వసతి లేకపోవడంతో ఆ దుమ్మూ, ధూళిలోనే ఎక్కడో అక్కడ చేయాలి. బాత్రూమ్, లెట్రిన్ సదుపాయలు లేక మహిళా కూలీలు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. త్రాగేందుకు మంచినీటి సౌకర్యం అత్యధిక మిల్లుల్లో లేదంటే అతిశయోక్తి కాదు. చట్ట ప్రకారం 8గంటలు పనిదినం అమలు కావాలి. 8 గంటలు దాటాక అదనంగా చేసే శ్రమకు రెట్టింపు వేతనం చెల్లించాలి. కాని ఇదెక్కడా అమలు చేయడం లేదు. కార్మికులు పోరాడి సాధించుకొన్న కార్మిక చట్టాలు అమలు చేయకుండా రైసుమిల్లు యాజమానులు బాహాటంగానే ఉల్లంఘిస్తున్నారు.

చట్టప్రకారం హక్కులు కల్పించి వేతనాలు చెల్లించడం మాట అటుంచినా యజమానులతో జరిగిన అంగీకార ఒప్పందాలను సైతం పూర్తిస్థాయిలో అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. నిజానికి ఒప్పందాలనేవి నోటిమాటగా తప్ప లిఖిత పూర్వకంగా ఎక్కడా లేవు. ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు అమలు చేయకుండా ఎగ్గొట్టేందుకు కార్మికుల హాజరు తెలియజేసే రిజిస్టరును ఏ మిల్లులోను మెయిన్‌టెయిన్ చేయరు. ఒప్పందం ప్రకారం -2008లో - అంతకు ముందు చెల్లించిన వేతనాలపై 25 పైసలు పెంచారు. అదే సమయంలో 12 గంటల పనిదినం అమలులో ఉంది. ఇది కూడా 45 మిల్లులకు గాను సంఘటిత పడిన 10 మిల్లుల్లోనే అమలవుతున్నది. 12గంటల పనిదినంకు బదులు 15 గంటల పనిదినం అమలు చేశారు. వేతనాలు పెరిగిందన్న ఆనందం పని గంటల పెంపుతో నీరుగారిపోయింది. అమితమైన పని భారాన్ని యజమానులు చాకచక్యంగా అమలు చేశారు. చట్ట ప్రకారం ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని నేటికీ నెరవేర్చలేదు. అంతకు ముందు ప్రైవేటు పనికి ప్రభుత్వ రంగ సంస్థ ఎఫ్‌సిఐలో చేసే పనికి చెల్లించే వేతనాలు సమానంగా ఉండేవి. క్రమంగా ప్రైవేట్ పని కంటే ఎఫ్‌సిఐ పనికి చెల్లించే వేతనాన్ని తగ్గించి ఇవ్వటం ప్రారంభించారు. పెరుగుతున్న ధరలు, జీవన వ్యయం, తరుగుతున్న జీవన ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని వేతనాలు పెంచాల్సింది పోయి ఈ రకంగా కోత విధించటాన్ని కార్మికులు నిరసించారు. పని సీజన్‌లో ముఠా కార్మికులు, బాలబందు (సంచులు కుట్టే) పనివారు రోజుకు 250-300 రూపాయలు, అన్‌సీజన్‌లో 130-50-20 రూపాయలు, కూలీలకు రోజుకు రూ.102 లు, డ్రైవర్‌కు రూ.140లు కూలీ గిడుతున్నది. వాస్తవం ఇది కాగా, ముఠాకార్మికులు ఉన్నతోద్యోగులు పొందే వేతనాలను పొందుతున్నారని కార్మికుల బ్రతుకులను యజమానులు అపహాస్య మాడారు. ఈ రకమైన వాదనల ద్వారా మిల్లు యజమానులు కార్మికులపై మోపుతున్న పని భారాన్ని, అదనంగా చేస్తున్న శ్రమకు రెట్టింపు వేతనం చెల్లించడాన్ని ఉద్దేశపూర్వకంగానే దాటవేశారు. నిజానికి 45 మిల్లుల్లో కేవలం 11 మిల్లుల్లో పనిచేసే కార్మికులు మాత్రమే యూనియన్ ఏర్పాటు చేసుకున్నారు. మొత్తంగా రైస్ మిల్ కార్మికులలోని అనైక్యతను ఆసరాగా చేసుకొని మిల్లు యజమానులు తాము ఆడింది ఆట పాడింది పాటగా చలామణి అవుతున్నారు.

## కార్మికుల ఆందోళన

ఈ నేపథ్యంలో ఎఐఎఫ్‌టియు (న్యూ) అనుబంధ అభ్యుదయ రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 2012 జనవరి 1 తేదీనుండి 0.60పైసలు పెంచివేతనాలుఇవ్వాలని, ప్రైవేటుపనికి - ఎఫ్‌సిఐ పనికి చెల్లించే వేతనాల్లో ఉన్న వ్యత్యాసాన్ని రద్దు చేయాలని సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, తాగునీరు, బాత్రూమ్, లెట్రిన్ సౌకర్యాలు, భోజనాల కొరకు వసతి వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని; ఇఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా వంటి సదుపాయలు కల్పించాలని, ధూళి, దూగరా వంటి వాటినుండి రక్షణకు కాలుష్యనివారణకు తగిన నియంత్రణా చర్యలను అమలు చేయాలని, కార్మికులకు మాస్కులు ఇవ్వాలనే డిమాండ్లతో కూడిన నోటీసులను కార్మికులు పట్టణంలోని 11 రైస్‌మిల్లుల యజమానులకు ఇచ్చారు. కార్మికులు పలుమార్లు అభ్యర్థించినా యజమానులు స్పందించలేదు. 2012 జనవరి 18,24, ఫిబ్రవరి 13 తేదీల్లో డిప్యూటి లేబర్ కమీషనర్ సమక్షంలో జరిగిన చర్చలు విఫలం అయ్యాయి. సామరస్యంగా పరిష్కారం అయ్యేందుకు తగిన ప్రతిపాదనలను యూనియన్ ప్రతినిధులు చేస్తే యజమానులు తిరస్కరించారు. 15 పైసలు మాత్రమే వేతనాలు పెంచుతామని భీష్మించుకూర్చున్నారు. యజమానులు ప్రదర్శిస్తున్న మొండి వైఖరి కారణంగా 25.1 2012 నుండి కార్మికులు నిరవధిక సమ్మె ప్రారంభించారు. 27.1.2012న 120 మంది కార్మికులు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేసి కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. 31.1.2012న జడ్‌పి సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి అసిస్టెంట్ లేబర్ కమీషనర్‌కు, విజయవాడ డిప్యూటి ఛీఫ్ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్‌కు మెమోరాండంలు ఇచ్చారు. 16.2.2012 వరకు 23 రోజులు పాటు సమ్మె కొనసాగించారు. సమ్మెకాలంలో 2 సార్లు లారీలు, ఎడ్లబండ్లలో ధాన్యంబస్తాలు తీసుకొచ్చి దించేందుకు కొందరు మిల్లు యజమానులు ప్రయత్నం చేశారు. కార్మికులు దీనిని గట్టిగా ఎదుర్కొన్నారు. అప్రమత్తంగా వ్యవహరించారు. ఇక్కడొక విషయం గమనించదగింది. చిన్న మిల్లుల యజమానులకు కార్మికుల సమ్మె కొనసాగడం ఇష్టంలేదు. కార్మికుల కోర్కెలను ఉభయతారకంగా పరిష్కరించుకుందామని భావించారు. అయితే పెద్ద మిల్లుల యజమానులు దీన్ని అడ్డుకుంటూ వచ్చారు. కార్మికులు నిరవధికంగా సమ్మె చేసే అనివార్య పరిస్థితుల్ని కల్పించి, చిన్న మిల్లు యజమానులను ఏకకాలంలో దెబ్బతీసేందుకు పెద్ద మిల్లుల యజమానులు పథక రచన చేశారని అర్థమౌతుంది.

16.2.2012న యజమానుల ప్రతినిధులకు, కార్మికులకు మధ్య చర్చలు జరిగాయి. ముఠాకార్మికులు, బాలబందు పని వారికి 0.20 పైసలు, కూలీలు, డ్రైవర్లకు 0.25 పైసలు పెంచాలని, వేతనాల పెంపుదలను జనవరి 1 తేదీనుండి లెక్కగట్టి అమలు చేయాలని, ఇఎస్ఐ, లెట్రిన్, బాత్రూమ్, మంచినీళ్ళ సౌకర్యం కల్పించేందుకు హామీ ఇచ్చారు. ఇంకా కొన్ని డిమాండ్లు పరిష్కారం కావలసివున్నప్పటికీ మొత్తంగా పరిస్థితిని గమనంలోకి తీసుకుని సమ్మె ముగించి 17.2.12 నుండి కార్మికులు పనుల్లోకి వెళ్ళాలని నిర్ణయించుకున్నారు.

సమ్మెకాలంలో రైస్‌మిల్లు కార్మికులు ఐక్యతను, పట్టుదలను ప్రదర్శించారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా గట్టిగా నిలబడ్డారు. 19.2.12న మచిలీపట్నం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో రైస్‌మిల్ కార్మికులతో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఎఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ఈ సమావేశంలో ప్రసంగించారు. కార్మికులు ఎదుర్కొంటున్న దుర్భర జీవితాలను సోదాహరణంగా వివరించారు. కార్మిక చట్టాల అమలుతీరును ఎండగట్టారు. యజమానులు కార్మికులపై రుద్దుతున్న పనిభారాన్ని, శ్రమదోపిడీని వివరించారు. సమ్మెను విజయవంతం చేసి కోర్కెలు సాధించుకున్న కార్మికుల్ని అభినందిస్తూ 8 గంటల పనిదినం, శ్రమకు తగ్గ ప్రతిఫలాన్ని సాధించాలని ఇందుకు మునుముందు కృషి చేయాలని కార్మికుల కర్తవ్యాలను గుర్తు చేశారు. టూ టౌన్ ముఠావర్కర్స్ యూనియన్, చిలకలపూడి సిడబ్ల్యుసి ముఠావర్కర్స్ యూనియన్ సిఐటియు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నవయువ సమాఖ్య తదితర సంఘాలు కార్మికుల సమ్మెకు సంఘీభావంగా నిలిచాయి. ఎఐఎఫ్‌టియు (న్యూ) బందరు ఏరియా అధ్యక్ష కార్యదర్శులు కా॥ ముచ్చు సుధాకర్‌రావు, బెల్లంకొండ రవి, అభ్యుదయ రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జె. జగన్, కార్యదర్శి బండ్రెడ్డి సుబ్రహ్మణ్యం, కోశాధికారి సుంకర సూర్యనారాయణ; సత్యనారాయణ, రంగారావు, చింతయ్య తదితరులు ఆందోళనకు నాయతక్వం వహించారు.

N

# రసాయన క్రిమిసంహారకాలనుత్పత్తి చేసే బహుళజాతి పరిశ్రమలు కల్గించే దుష్ప్రభావాలు

**ఉపేంద్ర బక్షి** (న్యాయశాస్త్ర ఆచార్యులు, యూనివర్శిటీ ఆఫ్ వార్విక్, యు.కె), రికార్డా స్టెయిన్ బీచర్ (మాలిక్యూలర్ జెనిటిసిస్ట్ అండ్ డెవలప్‌మెంటర్ బయాలజిస్ట్), జియాన్ని టొగ్నోని (పర్మినెంట్ పీపుల్స్ ట్రిబ్యునల్ సెక్రటరీ జనరల్), ఇబ్రహింలీ (న్యాయశాస్త్ర ఆచార్యులు, యు.సి.ఏ,డి)లతో 'పర్మినెంట్ పీపుల్స్ ట్రిబ్యునల్' సంస్థ 2011 డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో బెంగుళూరులో ఒక సదస్సు నిర్వహించింది. ప్రపంచదేశాలలో రసాయన ఎరువులు - పురుగుమందులనుత్పత్తిజేసి విక్రయించే ఆరు బడా బహుళజాతి కార్పొరేట్ సంస్థల కార్యకలాపాలను ఈ సదస్సు తప్పుపట్టింది.

ఈ బడా పురుగుమందుల కంపెనీలను ఆదరిస్తున్న మనదేశంవంటి దేశాల నుండి; ఎఫ్.ఏ.ఓ., డబ్ల్యు.టి.ఓ. వంటి అంతర్జాతీయ సంస్థల నుండి, ప్రపంచవ్యాపితంగా ఈ సదస్సుకు హాజరైన వారి వాంగ్మూలాలను నమోదు చేసిన అనంతరం ముగింపులో 'పర్మినెంట్ పీపుల్స్ ట్రిబ్యునల్'కు చెందిన న్యాయమూర్తుల బృందం తమ నిర్ధారణలను వెలువరించింది.

బహుళజాతి కార్పొరేట్ సంస్థల కార్యకలాపాలను తమతమ దేశాల్లో నియంత్రించి, అదుపాజ్ఞలలో వుంచుకోవటంలో ఆయాదేశాల వైఫల్యం కూడా శిక్షార్హమైనదేనని న్యాయమూర్తులు పేర్కొన్నారు. బేయర్, బి.ఏ.ఎస్.ఎఫ్., డ్యూపాంట్, మాన్‌శాంటో, సింజెంటా, డౌకెమికల్స్ - ఈ ఆరు ట్రాన్స్‌నేషనల్ పరిశ్రమలు ప్రజల ఆరోగ్యాలపై కల్గించే ప్రభావాలకు సంబంధించి; అవి సాగించే మానవ హక్కుల ఉల్లంఘనల గురించి; అవి చేస్తున్న అనైతిక కార్యక్రమాల గురించి ప్రపంచదేశాల నుండి హాజరైన ప్రతినిధులు అందజేసిన వివరాలను ఈ సదస్సులో నమోదు చేశారు.

తమ నిర్ధారణలకు సంబంధించిన వివిధ కోణాలను పేర్కొంటూ జర్మన్ ఆర్థికవేత్త ఎల్మార్ ఆల్ట్‌వాటర్ - ప్రజా సంపదల ఆర్థిక సరళీకరణ, అనియంత్రిత విధానాలు, ప్రైవేటీకరణ విధానాలు, ఈ విపరిణామాలకు కారణమయ్యాయని ట్రాన్స్‌నేషనల్ పరిశ్రమలు క్రమక్రమంగా తమ పెట్టుబడులను పెంచుకుంటూ పరిశ్రమలను విస్తరిస్తున్నాయని, ఈ పరిశ్రమల లాభాలవేటలో జవాబుదారీతనం లేదనీ, వీటన్నింటికీ ప్రజలే మూల్యం చెల్లించవలసి వస్తున్నదని ఆయన పేర్కొన్నారు

**(ది హిందు, 7-12-2011నుండి)**

# జన్యుమార్పిడి పంటలకు ఎస్.ఏ.జి.ఇ. వ్యతిరేకత

జన్యుమార్పిడి పంటలు బలమైన శాస్త్రీయ సూత్రాలపై ఆధారపడినవిగావనీ, జీవపరిణామ సహజక్రమానికి విఘాతం కలిగిస్తాయనీ సదరన్ యాక్షన్ ఆన్ జెనెటిక్ ఇంజనీరింగ్ (యస్.ఏ.జి.ఇ) సంస్థ, తన తీర్మానంలో పునరుద్ఘాటించింది. 'బి.టి.పత్తి-పూర్వాపరాలు; జన్యుమార్పిడి వంగడాల స్థితి - పర్యవసానాలు; ఆసియా, ఆఫ్రికాదేశాలలో జన్యుమార్పిడి సాంకేతిక అనంతర పరిస్థితి' అనే చర్చనీయాంశాలతో జనవరి 16, 17 తేదీల్లో 'జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ' నిర్వహించిన రెండు రోజుల ఆఫ్రో - ఆసియా దేశాల సదస్సు ఈమేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

సాంకేతికతకు, సిద్ధాంతాలకు సరిహద్దుల పరిమితి లేకపోయినప్పటికీ, వాటన్నిటి పరమావధి ప్రజల హితాన్ని కాంక్షించేవిగా వుండాలని ఈ సదస్సు పిలుపు నిచ్చింది.

ప్రఖ్యాత జీవాణుశాస్త్రవేత్త పి.ఎమ్. భార్గవ, ఇతర శాస్త్రవేత్తలు ఈ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఇంకా ఈ సమావేశంలో పశ్చిమ ఆఫ్రికాదేశాల నుండి; కెనాడా, బంగ్లాదేశ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్‌వంటి దేశాల నుండి అనేకమంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు, రైతులు, పర్యావరణ వేత్తలు, ఆహార సార్వభౌమత్వాన్ని కాంక్షించే కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సదస్సులో పాల్గొన్న వారందరూ ఆమోదించిన ఉమ్మడి ప్రకటనలో జీవవైవిధ్యం, సేంద్రియ వ్యవసాయం అనేవి ప్రపంచ ఆహార అవసరాలను తీర్చే అతి ముఖ్యమైన మార్గాలుగా పేర్కొన్నారు. కాలుష్యరహిత పర్యావరణానికో, పెరుగుతున్న ప్రపంచ ప్రజల ఆహార అవసరాల్ని అందుకోవటానికో జన్యుమార్పిడి పంటలనేవి ఏవిధంగానూ పరిష్కారమార్గం కావని పేర్కొన్నారు.

జన్యుమార్పిడి పంటలకు అధిక స్థాయిలో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం అవసరమౌతుందని, రైతులచేతుల నుండి విత్తనాలపై నియంత్రణ గుంజివేయబడుతుందని పై తీర్మానంలో పేర్కొంటూ ప్రపంచానికి తిండికొరత తీర్చేందుకు జన్యుమార్పిడి వ్యవసాయం అవసరమనే జీవ సాంకేతిక పరిశ్రమ దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, వాస్తవాలను వెల్లడించారు. "కాలుష్య కారుడే చెల్లించాలి" సూత్రంపై కార్పొరేట్‌సంస్థలు వాటి చర్యలకు జవాబు దారీగా వుండేవిధంగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం శ్రద్ధ వహించాలని ఈ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు కోరారు.

**(ది హిందు, 23-1-2012 నుండి)**


## జనశక్తి యాజమాన్య వివరాలు

(ఫారం 4 రూల్ 8 ప్రకారం)

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రచురణ స్థలం | : | విజయవాడ, 520 002 |
| 2. | ప్రచురణ కాలం | : | పక్షానికొకసారి (పక్ష పత్రిక) |
| 3. | ముద్రాపకుని పేరు | : | పి.జస్వంతరావు |
| | జాతీయత, చిరునామా: | | భారతీయుడు<br>32-13-26/1, బోయపాటి మాధవరావు రోడ్,<br>మొగల్రాజపురం, విజయవాడ-520 010 |
| 4. | ప్రచురణ కర్త పేరు,<br>జాతీయత, చిరునామా: | | పై విధంగానే |
| 5. | సంపాదకుని పేరు | : | పి.జస్వంతరావు |
| 6. | భాగస్వాములు | : | - |

పైన పేర్కొన్న విషయములన్నియు యదార్థములు

5.3.2012

సం॥ పి.జస్వంతరావు
ప్రచురణకర్త

# పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాల పర్యవసానమే పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలు

**గుంటూరు, కృష్ణాజిల్లాలలో** రైతుల – ముఖ్యంగా కౌలురైతుల ఆత్మహత్యలు ఒకదాని వెంట ఒకటిగా వెలుగులోకొస్తున్నాయి. వ్యవసాయకంగా అభివృద్ధి చెందిన ఈ జిల్లాలలో రైతులు ఆత్మహత్యలకు ఎందుకు నెట్టబడుతున్నారు? ఎందుకు అనేకమంది రైతులు అప్పుల ఊబిలో కూరుకొని పోతున్నారు? అనే అంశాలపై ఆయా జిల్లాల రైతుకూలీసంఘం కమిటీలు పరిశీలనలు చేశాయి. మృతుల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పటంతోపాటుగా – ఆత్మహత్యలు కాదు, పోరాటమే పరిష్కారమనే నినాదంతో – నిర్దుష్ట డిమాండ్లను రూపొందించి ప్రచార, ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాయి.

గుంటూరుజిల్లా, తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన కట్టా ఏసుబాబు అనే కౌలురైతు ఆరున్నర ఎకరాల భూమిని కౌలుకు సాగుచేస్తున్నాడు. ఇందుకుగాను కౌలుక్రింద భూయజమానులకు ఎకరాకు 20 వేల చొప్పున లక్షాముప్పై వేల రూపాయలు చెల్లించాడు. ఈ ఖర్చుతోపాటు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకోసం మరో 2 లక్షల రూపాయల వరకు అప్పులు చేయవలసివచ్చింది. గత సీజన్‌లో వర్షాల అనిశ్చితి కారణంగా పైరు పెరుగుదల తగిన విధంగా లేక, పత్తి దిగుబడి ఎకరాకు నాలుగు క్వింటాళ్ళకు పడిపోయింది. మిర్చిపంటకు బొప్పెర తెలుగు సోకింది. పంట దిగుబడి తగ్గటం, వ్యవసాయ ఖర్చులు పెరగటం, గిట్టుబాటు ధరలేకపోవటానికి తోడు కౌలుభారంతో తడిసిమోపెడై 27 సం॥ల ఏసుబాబు అనే ఆ కౌలు రైతు 2012 జనవరి 1వ తేదీన బలవన్మరణానికి పాల్పడ్డాడు.

గుంటూరుజిల్లా, అమరావతి మండలం జూపూడి గ్రామానికి చెందిన జెర్రిపోతు దాసు అనే కౌలురైతు, తనకున్న కొద్దిపాటి భూమికితోడు 3 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. గత సంవత్సరం కంటే కౌలు చెల్లింపులు; ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు తదితర వ్యవసాయ ఖర్చుల పెరుగుదలతో వ్యవసాయం రైతుకు పెనుభారమైంది. కృష్ణానది ప్రక్కనేవున్నా, లిఫ్ట్‌ఇరిగేషన్ పథకాలున్నా పంటపొలాలకు నీరందలేదు. పత్తి ఎకరాకు 3 క్వింటాళ్ళలోపే పండింది. మిర్చికి బొప్పర తెగసోకి దిగుబడి బాగాతగ్గింది. అప్పటిదాకా రు. 13 వేల దాకా వున్న మిర్చి ధర, రైతుపంట మార్కెట్‌లోకి వచ్చిన వెంటనే అమాంతం రు. 4 వేల దాకా పడిపోయింది. సాగుచేయటానికి అయిన ఖర్చుకు – పంట దిగుబడి ద్వారా వచ్చే ఆదాయానికి నక్కకు నాగలోకానికి వున్నంత అంతరముంది. కాగా, ఇందులో రైతు కుటుంబ శ్రమను లెక్కలోకే తీసుకోవటంలేదు. ఒక్కసారిగా పెద్దమొత్తంలో నష్టం రావటం, గత కాలపు అప్పులు కలగలవటం, అప్పులు తీర్చే మార్గం కానరాకపోవటం, కుటుంబాన్ని సాకటమే గగనమైపోవటం, తదితర కారణాలతో అత్యంత నిస్పృహకు లోనై జెర్రిపోతు దాసు (55) ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కృష్ణాజిల్లా, ఘంటసాల మండలం, దాలిపర్రు గ్రామానికి చెందిన బొందలపాటి శివరామకృష్ణ ప్రసాద్ 2 ఎకరాల స్వంతభూమి వున్న రైతు. ఎకరాకు 24 బస్తాలు ధాన్యంగా కౌలు చెల్లించే లెక్కన 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. దాదాపు 10 లక్షల రూపాయల వరకు వ్యవసాయ ఖర్చులు అయ్యాయి. దీనిలో అధికభాగం రూ.2ల వడ్డీకి తీసుకువచ్చాడు. పంటనష్టం కారణంగా, పండినపంటకు ధరలేని కారణంగా దాదాపు 16 లక్షల రూపాయల అప్పు మిగిలింది. ఈ రైతు గత 20 సంవత్సరాలుగా 5 నుండి 25 ఎకరాల భూమిని కౌలుకు చేస్తున్నాడు. ముఖ్యంగా గత 2,3 సంవత్సరాలుగా వరుసగా వ్యవసాయంలో వస్తున్న నష్టాలతో తిప్పుకోలేకపోయాడు.

ఈ సంవత్సరం డిసెంబరు 31, జనవరి 2న కురిసిన భారీవర్షాలకు పొలాల్లో కుప్పలు తడిసిపోయాయి. మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోయిన ఫలితంగా దాదాపు 10 రోజులపాటు వర్షపు నీరు పొలాలలోనే నిల్వవున్నది. తేమ శాతం అధికంగా వుందనే పేరిట ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ఈ ముక్కిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. ఇదేకారణంగా అకాల వర్షాల బారినపడిన రైతులంతా తీవ్రనష్టాలపాలైనారు. ఈ నేపథ్యంలోనే కౌలు రైతు శివరామకృష్ణప్రసాద్ (41 సం॥లు)ఉరిబోసుకొని నిండుప్రాణాన్ని బలిచేసుకున్నాడు.

నిరంతరాయంగా కొనసాగుతున్న రైతుల బలవన్మరణాలన్నీ వ్యవసాయరంగ సంక్షోభతీవ్రతకు నిదర్శనంగా వున్నాయి. రానురాను వ్యవసాయ ఖర్చులు పెరిగిపోవటం; పంట దిగుబడులకు ఖర్చులకు పొంతనలేక రైతు రుణభారంలో కూరుకుపోవటం; ప్రపంచబ్యాంకు షరతులకు లోబడిన పాలకులు రైతాంగానికిచ్చే కనీస పాటి సబ్సిడీలన్నిటినీ ఒక్కటొక్కటిగా దిగకోసి అంతిమంగా ఎత్తివేయటం; రైతులకు ప్రభుత్వ సంస్థాగత రుణపరపతి సౌకర్యాన్ని ఆచరణలో రద్దుపరచి, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల కబంధహస్తాలలోకి నెట్టివేయటం; మీదు మిక్కిలి కౌలు రైతుల హక్కులన్నీ కాలరాయటం; రైతుచేతిలోని విత్తనాలను గుంజివేసి – చీడపీడలను ఎక్కువగా ఆశించే, అంతకంతకు రసాయన ఎరువుల, పురుగుమందుల వినియోగాన్ని అధికం చేసే బహుళజాతి విత్తనకంపెనీల దయా దాక్షిణ్యాల కొదిలివేయటం; కల్తీ విత్తనాలు; ఎరువు, పురుగుమందులను నిరోధించకుండా పెద్దఎత్తున అక్రమ లాభార్జనలకు రైతులను బలిచేయటం; పంట కాల్వలను, మురుగునీటి వ్యవస్థను, విద్యుత్ సరఫరాలను సక్రమంగా మెరుగుపరచకుండా గాలికొదిలేయటం;అతివృష్టి, అనావృష్టిల సందర్భంగా రైతులనాదుకోకుండా నెపాన్ని ప్రకృతిపై నెట్టివేసి చేతులు దులుపుకోవటం; పండిన పంటను సకాలంలో ప్రభుత్వరంగ సంస్థలు రంగంలోకి దిగి కొనుగోలు చేయకుండా ప్రైవేటు వ్యాపారులతో కుమ్మక్కవటం; మార్కెట్ శక్తుల నియంత్రణకు ప్రభుత్వం తిలోదకాలివ్వడం; వ్యవసాయాన్ని జూదంగా మార్చి వేయటం; సామ్రాజ్యవాద బడాగుత్తసంస్థల కనుగుణమైన భవిష్యవాణిజ్యాన్ని అనుమతించి కాంట్రాక్టు, కార్పొరేటు సాగుకు రైతులను బలవంతాన మళ్ళించే విధానాలను అవలంబించటం వంటి కారణాలన్నీ కలగలిసి వ్యవసాయ సంక్షోభాన్ని, రైతాంగ సంక్షోభాన్ని తీవ్రంచేస్తున్నాయి. తత్ఫలితంగానే రైతుల బలవన్మరణాలు ఆగకుండా సాగుతున్నాయి. అందుకే సారాంశంలో రైతాంగ ఆత్మహత్యలన్నీ పాలకుల హత్యలే. ప్రపంచానికంతటికీ అవసరమైన ఆహార ధాన్యాల్ని పండించే రైతులు చేజేతులా తమ ప్రాణాల్ని తామే తీసుకొనే దుస్థితికి కారకులైన పాలకులపై; భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ విధానాలకు ఊడిగంచేసే ప్రభుత్వ విధానాలపై రైతు – కూలీలు గ్రామీణ పేదలతో కలసి సంఘటిత పోరాటం సాగించాలి. ఆత్మహత్యలు కాదు పోరాటమే పరిష్కారమని నినదించాలి. N

# 'వరి, మినుము పంటలకు గిట్టుబాటుధరకై రైతాంగం సంఘటితంగా ఉద్యమించాలి'

## నెల్లూరు జిల్లా రైతుకూలీ సంఘం సదస్సు పిలుపు

**వెంకటగిరి, 12-2-12:**

వరి, మినుము పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రెట్టింపు పెరిగిన రసాయనిక ఎరువుల ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నెల్లూరుజిల్లా రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్.వి.ఎం. హైస్కూలు ఆవరణలో సదస్సు జరిగింది.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె. కిషోర్‌బాబు ఈ సదస్సులో మాట్లాడుతూ ఈసీజన్‌లో ఎరువుల ధరలు, ఇతర వ్యవసాయ ఖర్చులు భారీగా పెరగడంతో పెట్టుబడి ఖర్చు రెట్టింపైందని; దానికితోడు భారీ వర్షాలకు మినుము పంట తడిసి పోవడం, కలుపు పెరిగిపోవడంతో మినుము దిగుబడి కూడా తగ్గిపోయిందని, ఇదే అదనుగా మార్కెట్ శక్తులు మినుము కొనుగోలు ధర కూడా తగ్గించి వేశారనీ, దీనితో పెట్టిన పెట్టుబడి కూడా చేతికందక రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఎరువుల ధరలు నిర్ణయించడంలో గతంలో ప్రభుత్వ నియంత్రణ వుండేదని, నేడు ఆ నియంత్రణను ఎత్తివేయడంతో డి.ఎ.పి. పొటాష్ ధరలను రోజు రోజుకీ పెంచుతూ కంపెనీలు అడ్డగోలుగా రైతాంగాన్ని దోపిడీ చేస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం ఎరువుల సబ్సిడీపై కోత విధించడంతో రైతులపై భారం తడిసి మోపిడైందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణులు ఎకరం వరిసాగుకి ఏ గ్రేడ్ రకాలకి రూ. 28,784, సాధారణ రకాలకి రూ. 27,140 ఖర్చవుతుందని లెక్కగట్టి తేల్చి చెప్పారనీ, ఈ ఖర్చుని పరిగణలోకి తీసుకుని మేలురకానికి క్వింటాకి రూ, 2,135, సాధారణ రకానికి రూ.2012 మద్దతు ధర ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినా, కేంద్ర ప్రభుత్వం మేలు రకానికి రు.1,110, సాధారణ రకానికి రూ. 1,080 మద్దతు ధరగా నిర్ణయించారంటే రైతుని అప్పుల ఊబిలోకి ఉద్దేశపూరితంగా నెట్టినట్లు స్పష్ట మౌతుందన్నారు.

మద్దతు ధరను నిర్ణయించేటప్పుడు సేద్యానికి అయిన మొత్తం పెట్టుబడితోపాటు కనీసం 50 శాతం అదనంగా కలిపి నిర్ణయించాలని స్వామినాథన్ కమిషన్ చెప్పినా ప్రభుత్వం ఈ సిఫార్సును పాటించలేదనీ. నేడు ప్రభుత్వం నిర్ణయించి వున్న మద్దతు ధర –మిల్లర్లు, దళారులు రైతుల్ని అడ్డగోలుగా దోచుకోడానికి లైసెన్సు పొందినట్లైంది అని చెపుతూ రైతాంగం సంఘటితం కావడం ద్వారానే గిట్టుబాటు ధర సాధించుకోగలమని పిలుపునిచ్చారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ జి. సునీత మాట్లాడుతూ పాలకులు – ప్రపంచ వాణిజ్య సంస్థ షరతులకు తలొగ్గడం మూలంగానే రైతుకి ఈ దుస్థితి వచ్చిందని పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు రేటు అందిస్తే మార్కెట్లో బియ్యం, పప్పుల ధరలు పెరిగి వినియోగదారుడిపై భారం పడుతుందని ప్రభుత్వం తప్పుడు వాదన చేస్తోందని, వాస్తవానికి నేడు కిలో మినుములకి రైతుకి రూ. 30 ఇస్తుండగా చిల్లరంగడిలో కిలో మినపప్పు రూ. 60కి అమ్ముతున్నారనీ బి.పి.టి కిలో బియ్యానికి రైతుకు రూ.17 దక్కుతుండగా మార్కెట్‌లో కిలో రూ.25-30 అమ్ముతున్నాయన్నారు. ఈ వ్యత్యాసాన్ని దిగమింగుతున్న మిల్లర్లను నియంత్రించడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదని కా॥ సునీత ఎండగట్టారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా అధ్యక్షులు కా॥ వి. రవీంద్ర, రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కా॥ వి.వి.రమణయ్య ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు.

ఈ సదస్సుకు రైతునాయకులు గంగలపూడి కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. 22 గ్రామాల నుండి 150 మంది రైతులు సదస్సులో పాల్గొన్నారు. సదస్సు అనంతరం జరిగిన సమావేశంలో రైతుకార్యాచరణ సమితి ఏర్పడి ఫిబ్రవరి 22న వెంకటగిరి పట్టణంలో ర్యాలీ, రాస్తారోకో, ధర్నా నిర్వహించాని పిలుపునిచ్చింది. సదస్సుకు ముందుగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోని 47 గ్రామాల్లో ప్రచారం జరిగింది.

**వెంకటగిరి, 22-2-2012:**

వరి, మినుము పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రెట్టింపు పెరిగిన రసాయనిక ఎరువుల ధరలను తగ్గించాలన్న ముఖ్య డిమాండ్ల సాధనకై వెంకటగిరి పట్టణంలో ప్రదర్శన – రాస్తారోకో – ధర్నాలతో రైతులు ఆందోళన నిర్వహించారు. కాశీవిశ్వనాథుని ఆలయం నుండి ప్రదర్శనగా బయలుదేరి రాజావీధి, తూర్పు వీధి మీదుగా జ్యోతిమహల్ సెంటర్ చేరుకుని రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహశీల్‌దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 1. ధాన్యానికి క్వింటాకి రు.15 వందలు చెల్లించాలని, 2. మినుముకి క్వింటాకి రు. 5 వేలు చెల్లించాలని, వర్షాలకు దెబ్బతిన్న మినుము పంటకి ఎకరాకి రు. 10 వేలు ఇవ్వాలని 3. భారీగా పెరిగిన డి.ఎ.పి., పొటాష్, తదదితర రసాయనిక ఎరువులు, పురుగుమందుల ధరలను తగ్గించాలని, ఎరువుల ధరలపై ప్రభుత్వ నియంత్రణను కొనసాగించాలని, 4. వ్యవసాయంలో ఆయిల్ ఇంజన్లు, ట్రాక్టర్లు, వరికోత యంత్రాల వాడకంరీత్యా డీజిల్‌ధరలపై ప్రభుత్వ నియంత్రణను కొనసాగించాలనీ. పన్నులు తగ్గించి డీజిల్ ధరలు తగ్గించాలని, 5. వ్యవసాయ విద్యుత్తుని పగటిపూట ఇవ్వాలని, రాత్రికరెంటు ఇవ్వడంవలన పాముకాటు, విద్యుత్‌షాక్‌ల వంటి ప్రమాదాల నుండి రైతులను రక్షించాలని, విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల జరుగుతున్న ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న రైతు కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని 6. ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని. 7. మండల కేంద్రాలలో మార్కెటింగ్ యార్డులను నిర్వహించాలన్న డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని డిప్యూటి తహశీల్‌దారుకి, మండల వ్యవసాయ అధికారికి అందజేశారు.

ఈ ఆందోళన కార్యక్రమంలో రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె. కిషోర్‌బాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కా॥ వి. రవీంద్ర, జి. సునీత; రైతు కార్యాచరణ సమితి నాయకులు గంగలపూడి కృష్ణారెడ్డి, రామచంద్రయ్య, చెంచయ్య, తిరుపాలు, రమణయ్యనాయుడు మరియు వంద మంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటగిరి, బాలయాపల్లి, డక్కిలి మండలాల్లోని 52 గ్రామాల్లో విస్తృత ప్రచారం జరిగింది. N

# గిరిజనుల అటవీఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆందోళన

**పార్వతీపురం, 13-2-12:**

గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కేజీ చింతపండు ధర రూ.40గా ప్రకటించి గిరిజన సహకారసంస్థ (జిసిసి) వెంటనే కొనుగోలు ప్రారంభించాలని, జిసిసి ద్వారా నిత్యావసరాలను అందించాలని, చింతపండు కొన్న వెనువెంటనే జిసిసి గిరిజనులకు దాని తాలూకూ డబ్బు చెల్లించాలని, జిసిసిని పటిష్టపరిచేవిధంగా ప్రభుత్వం నిధులు కేటాయించాలని, జిసిసిని ఎత్తివేసే కుట్రలను మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) విజయనగరం జిల్లాకమిటీ ఆధ్వర్యంలో జిసిసి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో కొమరాడ, పార్వతీపురం, మక్కువ, కురుపాం, సాలూరు మండలాల నుండి 300 మంది గిరిజనులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కా॥ డి.వర్మ మాట్లాడుతూ మహత్తర శ్రీకాకుళ గిరిజన పోరాట అనంతరం గిరిజనులను ఆదుకోవడానికి, గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాచేసుకొని సంతల్లో షావుకార్లు చేస్తున్న మోసాలను, దోపిడీని అరికట్టడానికి, ప్రభుత్వం గిరిజన సహకార సంస్థను ఏర్పాటు చేసిందనీ; అటవీ మరియు వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయటం, డి.ఆర్.డిపోల ద్వారా గిరిజనులకు నిత్యావసర సరుకుల అమ్మకాలు సాగించటం, గిరిజనులకు వ్యవసాయ రుణాలు మంజూరు చేయటం – కర్తవ్యాలుగా జిసిసి ఏర్పడిందన్నారు. కానీ, దీనికి భిన్నంగా జిసిసి గిరిజనుల నుండి సేకరిస్తున్న చింతపండు, కొండచీపుర్లు, అడ్డాకులు, జిగురు, తేనె, కుంకుళ్ళు, ఇప్పపువ్వు మొదలైన అటవీ ఉత్పత్తులకు కనీసం మద్దతుధరను కూడా ప్రకటిచటం లేదనీ, బయట నుండి వచ్చిన షావుకార్లు కేజీ చింతపండును రూ.15 చెల్లించి తూనికల దగ్గర మోసాలతో గిరిజనులను దోపిడీ చేస్తున్నా జిసిసి అరికట్టటం లేదని చెప్తూ గిరిజనులు సంఘటిత పోరాటం ద్వారానే తమ డిమాండ్లను నెరవేర్చుకోగలరన్నారు.

రైతు కూలీసంఘం జిల్లా అధ్యక్షులు కా॥ ఊయక ముత్యాలు ఈ ధర్నాలో పాల్గొని ప్రసంగిస్తూ జిసిసి కోల్డుస్టోరేజీ నిర్మించి అటవీ ఉత్పత్తులకు సరైన ధరను చెల్లించాలని అనేక సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని; పార్వతీపురం , గుమ్మలక్ష్మీపురం, సాలూరు శాఖల పరిధిలో 80 డి.ఆర్. డిపోలు నడుస్తున్నా నిత్యావసర వస్తువులను సక్రమంగా అమ్మని కారణంగా, అధిక ధరలు చెల్లించి కల్తీ, నకిలీ వస్తువులతో గిరిజనులు మోసగింపబడుతున్నారని, గిరిజనులకు వ్యవసాయ రుణాలందించటం ఏనాడో నిలిపివేశారనీ, వ్యవసాయ ఖర్చులకోసం గిరిజనులు ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులపై ఆధారపడడంతో అధిక వడ్డీరేట్లతో, అడ్డగోలు దోపిడీకి గురవుతున్నారని వివరిస్తూ ప్రభుత్వం మెడలువంచి జిసిసి ప్రకటిత లక్ష్యాలనైనా అమలు చేయించుకునేందుకు సంఘటిత సమరశీల పోరాటాలు సాగించాలని కా॥ ముత్యాలు పిలుపు నిచ్చారు.

ఈ ధర్నాలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా ఉపాధ్యక్షులు కా॥ బి. నరసింగరావు, జిల్లా సహాయ కార్యదర్శి కా॥ ఎం. భాస్కరరావు, జిల్లా కోశాధికారి కా॥ పి. శ్రీనునాయుడు, గిరిజన నాయకులు కా॥ కద్రక వెంకటస్వామి పాల్గొని ప్రసంగించారు. అనంతరం గిరిజనుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీసిసి డివిజనల్ మేనేజర్‌కు అందజేశారు. N

Printed, Published and Owned by P. Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010